అమలాపురంలో బాలిక కిడ్నాప్
కాకినాడ తీసుకెళ్లినట్టు గుర్తింపు 7



అమరావతిలో ఇంజనీరింగ్ నిపుణులతో శంకరగుప్తం డ్రెయిన్ సమస్యపై సమీక్షిస్తున్న మంత్రి

శంకరగుప్తం డ్రెయిన్ మరమ్మతులకు రూ.21 కోట్లు

- ఆర్థికశాఖకు ప్రతిపాదన పంపిస్తున్నాం : మంత్రి నిమ్మల
- రామానాయుడుకు నివేదిక అందించిన నిపుణుల కమిటీ
- అమరావతిలో ఇంజనీరింగ్ నిపుణుల కమిటీతో మంత్రి సమీక్ష

అమలాపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలోని ప్రధానమైన శంకరగుప్తం డ్రెయిన్ సమస్య పరిష్కారానికి ఎట్టకేలకు అడుగులు పడుతున్నాయి. చాలా కాలంగా ఈ సమస్య జఠిలంగా మారడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రజాప్రతినిధులు, రైతుల సంఘాల నాయకులు ఈ విషయాన్ని పదేపదే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష నిర్వహించారు. సోమవారం అమరావతిలోని సచివాలయంలో ఈ సమస్యపై ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి, గోదావరి డెల్టా సీఈ, ఈఈలతో పాటు ఇతర అధికారులతో మంత్రి కీలకంగా సమీక్షించారు. వాస్తవానికి గతంలోనే శంకరగుప్తం డ్రెయిన్ సమస్యను మంత్రి రామానాయుడు స్వయంగా ఆ ప్రాంతంలో పర్యటించి పరిశీలించారు. ఈ డ్రెయిన్‌లోకి ఉప్పునీరు రావడం వల్ల సమీపంలో ఉన్న వేల కొబ్బరిచెట్లు చనిపోయి రైతులకు చాలా నష్టం జరిగింది. ఈ నేపథ్యంలోనే శంకరగుప్తం డ్రెయిన్ ప్రాంతాన్ని గత నెలాఖరున డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటించనున్నారని అధికారులు ఏర్పాట్లు కూడా చేశారు. కానీ చివరి క్షణంలో పవన్ పర్యటన వాయిదా పడింది. తదనంతరం శంకరగుప్తం డ్రెయిన్ సమస్యపై మరోసారి జలవనరులశాఖ మంత్రి రామానాయుడు ఇటీవల అధికారులతో చర్చించారు. కొబ్బరి రైతుల సమస్యల దృష్ట్యా ఈ కీలక సమస్య పరిష్కారానికి ఆ సందర్భంగా ఉన్నతస్థాయి నిపుణుల కమిటీని నియమించారు. శంకరగుప్తం డ్రెయిన్ స్థితిగతులు, ముంపునకు గల కారణాలు, తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి రామానాయుడు ఆదేశాల మేరకు నిపుణుల కమిటీ పరిశీలన చేపట్టింది. సముద్రపు అలలతో ముంపునకు గురవుతున్న కేశవదాసుపాలెం, శంకరగుప్తం, పడమటిపాలెం, కేశనపల్లి, తూర్పుపాలెం, గొల్లపాలెం, కరవాక గ్రామాలను పరిశీలించి కమిటీ నివేదికను మంత్రి రామానాయుడుకు అందజేశారు. శంకరగుప్తం డ్రెయిన్ ద్వారా సముద్రపునీరు వెనక్కి రావడంతో వేలాది ఎకరాల్లో పంటనష్టం కలుగుతుందని తెలిపారు. నివేదిక ఆధారంగా శంకరగుప్తం డ్రెయిన్‌ను పరిష్కరించడానికి రూ.21కోట్ల మంజూరుకు ఆర్థికశాఖకు ప్రతిపాదనలు పంపిస్తున్నట్టు మంత్రి తెలిపారు.



కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్.. ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌మీనా

కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 230 అర్జీలు

పరిష్కారంపై శ్రద్ధచూపి ప్రభుత్వంపై విశ్వసనీయత పెంపొందించాలి : కలెక్టర్

అమలాపురం, నవంబరు10(ఆంధ్రజ్యోతి): ప్రతీ అర్జీకి పారదర్శకత, నాణ్యతతో పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. వివిధ శాఖల అధికారులు పాల్గొనగా, మొత్తం 230 అర్జీలను ప్రజల నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధచూపి ప్రభుత్వ పనితీరుపై విశ్వసనీయత పెంపొందించాలన్నారు. శాఖల వారీగా అర్జీలను క్షుణ్ణంగా క్షేత్రస్థాయిలో విచారించి దరఖాస్తుదారులకు న్యాయమైన పరిష్కారాన్ని చూపాలని కోరారు. ఒక్కో ఫిర్యాదు విషయంలో కొంత సమయం అవసరం ఉన్నప్పుడు ఆ విషయాన్ని ఫిర్యాదుదారులతో స్వయంగా అధికారులు చెప్పాలని సూచించారు. ఫిర్యాదులు తమ పరిధిలో లేనప్పుడు వెంటనే ఆ శాఖ అధికారులకు దృష్టిలో ఉంచాలని పేర్కొన్నారు. ఈ పీజీఆర్ఎస్ కార్యక్రమానికి కలెక్టర్ అధ్యక్షత వహించగా డీఆర్వో కె.మాధవి, సమగ్రశిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మి, డీఎల్డీవో రాజేశ్వరరావుతోపాటు జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో..

అమలాపురంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రాహుల్ మీనా ఆధ్వర్యంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో భాగంగా సోమవారం ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారిసమస్యలు, వివరాలు అడిగితెలుసుకున్నారు. జిల్లావ్యాప్తంగా 51 ఫిర్యాదులు ఎస్పీకి అందాయి. వాటిలో కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, ఆర్థిక వివాదాలు, ఇతర వ్యక్తిగత సామాజిక సమస్యలపై వచ్చిన ఫిర్యాదులు ఉన్నాయి. ప్రతీ ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి ఆయా పోలీస్‌స్టేషన్లకు పంపించారు. నిర్ణీత గడువులోగా సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించాలని ఎస్పీ ఈ సందర్భంగా ఆదేశించారు.



రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సోమవారం రాత్రి తనిఖీలు చేస్తున్న పోలీసులు

జల్లెడ పట్టారు!

ఢిల్లీ పేలుడు ఘటన నేపథ్యంలో జిల్లాలో విస్తృత తనిఖీలు

రావులపాలెం/ముమ్మిడివరం/యానాం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన కారు బాంబు పేలుడు ఘటన నేపథ్యంలో జిల్లాలోనూ పలుచోట్ల సోమవారం రాత్రి విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌ల్లో క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే జిల్లా ముఖ ద్వారాలు, హైవేలు, ముఖ్య కూడళ్లు, మార్కెట్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లోనూ ఈ తనిఖీలు చేశారు. రావులపాలెం బస్ కాంప్లెక్స్ ప్రధాన కూడళ్లలో టౌన్ సీఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. టోల్‌గేట్ వద్ద కూడా తనిఖీలు చేశారు. ముమ్మిడివరం మార్కెట్ సెంటర్‌లో, అన్నంపల్లి టోల్‌గేట్ వద్ద పోలీసులు తనిఖీలు చేశారు. యానాం బైపాస్‌లోని అక్కడి ఎస్పీ వరదరాజన్ ఆదేశాల మేరకు ఎస్‌హెచ్‌వో పునీత్‌రాజ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.



వెరీ.. వెరీ.. గుడ్డు



- ఒక్కో గుడ్డు హోల్‌సేల్ రూ.6
- రిటైల్‌లో రూ.7కి విక్రయం
- ధరలకు రెక్కలు
- వినియోగదారులకు చుక్కలు
- పౌల్ట్రీ రైతులకు ఊరట
- కూరగాయలతో పోటీ
- లాభాల్లో రైతాంగం

మండపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎన్నడూ లేనిది కార్తీకమాసంలో గుడ్డు ధర పరుగులు పెడుతోంది. ప్రతి ఏడాది కార్తీకమాసంలో గుడ్డు ధర తక్కువగా ఉండేది. ఎందుకంటే ఈ మాసంలో శాకాహారులు ఎక్కువగా ఉంటారు. దీంతో ఎప్పుడూ గుడ్డు ధర తక్కువగా ఉండేది. అయితే దానికి భిన్నంగా ఈ ఏడాది మాత్రం పరుగులు పెడుతోంది. కోళ్ల ఫారాల నిర్వాహకులకు లాభాలు పండిస్తుంటే సామాన్యుడు మాత్రం గుడ్డు తినలేని పరిస్థితి కనిపిస్తోంది. గత రెండేళ్లపాటు పౌల్ట్రీ పరిశ్రమ ఒడిదుడుకులు చెందగా ఇప్పుడిప్పుడే పరిశ్రమ కుదుటపడుతోంది. గతంలో పరిశ్రమ నష్టాల కారణంగా చాలామంది రైతులు కోళ్ల ఫారాలను మూసివేశారు. కొంతమంది అయితే బ్యాచ్‌లు వేయలేదు. గతంలో అయితే బ్యాచ్‌లు వేసి గుడ్లు ఉత్పత్తి చేసేవారు. ప్రస్తుతం ఉత్పత్తి తగ్గడంతో డిమాండ్‌కు సరిపడా సరుకు లేకపోవడంవల్ల ధరలు పెరుగుదలకు కారణమని నిర్వాహకులు చెబుతున్నారు. ఒక గుడ్డు ఉత్పత్తికి రూ.4.80 పైసలు అవుతుంది. రూ.5 దాటి ధర ఉంటేనే గిట్టుబాటు ఉంటుందని పౌల్ట్రీ రైతులు అంటున్నారు.

గుడ్డు ధర ఊరట

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 300వరకు కోళ్ల ఫారాలు ఉన్నాయి. వీటిలో 1.40 కోట్ల మేర కోళ్లను పెంచుతున్నారు. రోజుకు 1.10 కోట్ల మేర గుడ్ల ఉత్పత్తి జరుగుతోంది. 40 శాతం స్థానిక అవసరాలకు విని యోగిస్తుండగా 60 శాతం గుడ్లు పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, బీహార్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలకు ఎగుమతులు జరుగుతుంటాయి. ఇక ప్రభుత్వం అంగన్‌వాడీలు, పాఠశాలలు, వసతిగృహాలు, ఆస్పత్రుల్లో గుడ్లు అందిస్తోంది. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలు, ఇంట్లోని వంటకాల్లో కూరలకు గుడ్లు విరివిగా వాడుతున్నారు. గుడ్డు భలే ఫుడ్ అన్నట్టుగా మారింది. డిమాండ్‌కు తగ్గట్టుగా గుడ్ల ఉత్పత్తి లేకపోవడంతో పాటు శీతాకాలం కావడంవల్ల వినియోగం పెరిగిందని నిర్వాహకులు చెబుతున్నారు. కొన్నేళ్లుగా కోళ్ల పరిశ్రమ నష్టాల్లో కూరుకుపోగా ఇప్పుడు కాస్తంత పెరిగిన గుడ్డు ధర ఊరటనిస్తోందని పౌల్ట్రీ నిర్వాహకుడు తాడి శేషారెడ్డి తెలిపారు. కాసింత లాభాలు చూస్తున్నామన్నారు.



గతేడాది రూ.5.65

కార్తీకమాసంలో కాయగూరల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కనీసం గుడ్డు కొనుగోలు చేసి కూర వండుకుందామంటే బయట రూ.7 నుంచి రూ.7.50 వరకు విక్రయిస్తున్నారు. దీంతో గుడ్డు కూడా తినలేని పరిస్థితి నెలకొందని వినియోగదారులు వాపోతున్నారు. గతేడాది నవంబరులో గుడ్డు ధర రూ.5.65 ఉండగా ఇప్పుడు ఇదే మాసంలో రూ.6కి చేరింది. చిల్లరగా గుడ్డు ధర బయట మార్కెట్‌లో రూ.6.50 నుంచి రూ.7కు వరకు విక్రయిస్తున్నారు. మొత్తం మీద కార్తీకంలో గుడ్డు ధర నిర్వాహకులకు ఊరటనిస్తుంటే కొనుగోలుదారులకు మాత్రం నీరసం కలిగిస్తోంది.

రాయితీలు కల్పించాలి

పరిశ్రమలో కోళ్లకు వాడే మేతల ధరల పెరుగుదల, మందుల ధరలు పెరగడం భారంగా మారిందని నిర్వాహకులు చెబుతున్నారు. కోళ్ల మేతలకు సంబంధించి ముడిసరుకు ధరలు పెరగడం తమకు భారంగా మారాయని నిర్వాహకులు చెబుతున్నారు. 2019లో ముడిసరుకు ధరలు తక్కువ ఉండడం వల్ల లాభాలు వచ్చాయని అంటున్నారు. ఇప్పుడు పెరిగిన దాణాల ధరలు తమకు భారంగా మారాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొరుగు రాష్ట్రాలైన యూపీ, వెస్ట్ బెంగాల్, ఒడిస్సా తదితర రాష్ట్రాల్లో సబ్సిడీలు ఇస్తుండగా ఇక్కడ మాత్రం ఇవ్వడం లేదు. దానివల్ల ఇక్కడ రైతులు మార్కెట్ ధరపైనే ఆధారపడాల్సి వస్తోంది. పొరుగు రాష్ట్రాల్లా ఇక్కడా ప్రభుత్వం కోళ్ల పరిశ్రమలకు రాయితీలు కల్పించాలని, ముడిసరుకు ధరల నియంత్రణకు చర్యలు తీసుకుని ఆదుకోవాలని పౌల్ట్రీ నిర్వాహకులు విజ్ఞప్తి చేస్తున్నారు.



అలమూరు మండలం పెనికేరులో తుఫాన్ వల్ల దెబ్బతిని నేలనంటిన పొంట పొలాలు

నేడు కేంద్ర బృందం పర్యటన

- ఆలమూరు మండలం పెనికేరులో పంట నష్టాల పరిశీలన
- జిల్లావ్యాప్తంగా రూ.560 కోట్లకు పైగా తుఫాన్ నష్టం

అమలాపురం, నవంబరు10(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో సంభవించిన పంట నష్టాలను అంచనా వేసేందుకు కేంద్ర బృందం కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండలం పెనికేరులో పర్యటించనుంది. తుఫాన్‌కు సంబంధించిన పంటనష్టాల అంచనాలను ఈ బృందం స్వయంగా పరిశీలించనుంది. రాజమహేంద్రవరం నుంచి మంగళవారం ఉదయం బయలుదేరి ఆలమూరు మండలం పెనికేరులో పంటనష్టాలను పరిశీలిస్తారు. ఈ సందర్భంగా తుఫాన్ నష్టాలపై చిత్రీకరించిన ఛాయాచిత్రాల ప్రదర్శన, ఫొటో ఎగ్జిబిషన్‌తోపాటు జిల్లా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేంద్ర బృందానికి నివేదిస్తారు. వ్యవసాయశాఖ డైరెక్టర్ కె.పొన్నుస్వామి, వాటర్ రిసోర్స్ మంత్రిత్వశాఖకు చెందిన డైరెక్టర్ శ్రీనివాసా భైరి, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ ఆర్తీ సింగ్, మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలెప్మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ మనోజ్ కుమార్‌మీనాలతో కూడిన బృందం మంగళవారం పర్యటిస్తుంది. కాగా తుఫాన్ వల్ల జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖలకు రూ.560 కోట్ల ఆస్తి నష్టం జరిగినట్టు అధికారులు అంచనా. పెనికేరు పర్యటన అనంతరం కొత్తపేటలో ఉద్యాన పంటలను కేంద్ర బృందం పరిశీలించనుంది.

జిల్లాలో నష్టాల అంచనాలిలా..

రోడ్లు, భవనాలశాఖకు రూ.188.62 కోట్లు, పంచాయతీరాజ్‌శాఖకు రూ.157.59కోట్లు, వ్యవసాయశాఖకు రూ.72.96 కోట్లు, ఇరిగేషన్, హెడ్‌వర్క్స్ శాఖ రూ.42.87 కోట్లు, ఆర్‌డబ్ల్యుఎస్‌కు రూ.39.15 కోట్లు, విద్యుత్‌శాఖకు రూ.16.12 కోట్లు, డీపీవో రూ.16.04 కోట్లు, ఇరిగేషన్, వాటర్ రిసోర్సు డిపార్టుమెంట్‌కు రూ.13.27 కోట్ల నష్టం జరిగింది. ఇక ఉద్యానశాఖకు రూ.51.06 కోట్లు, ఇరిగేషన్ డ్రైనేజీ విభాగానికి రూ.28 కోట్లు, సోషల్ వెల్ఫేర్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ డిపార్టుమెంటుకు రూ.23 కోట్లు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంటుకు రూ.11 కోట్లు, మత్స్యశాఖకు రూ.10 కోట్లు, మార్కెటింగ్‌కు రూ.10 కోట్లు, మెడికల్‌అండ్‌హెల్త్, యానిమల్ హజ్బెండరీశాఖకూ కోట్లలో నష్టం వాటిల్లింది.

ఓడలరేవులో ఉన్నతాధికారుల పర్యటన

చంద్రబాబు ఇటీవల పర్యటనతో గ్రామాభివృద్ధికి చకచకా ప్రణాళికలు



ఓడలరేవులో రోడ్లను పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

అల్లవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అల్లవరం మండలం ఓడలరేవు గ్రామంలో రోడ్లు, కల్వర్టులు తదితర అభివృద్ధి పనులు చేపట్టడానికి పంచాయతీరాజ్, విద్యుత్ ఉన్నతాధికారుల బృందం సోమవారం క్షేత్రస్థాయి పరిశీలన చేసింది. అక్టోబరు 29న మొంథా తుఫాన్ పర్యటనలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఓడలరేవు గ్రామాన్ని సందర్శించి రోడ్ల దుస్థితిని పరిశీలించి అభివృద్ధి పనులు చేపట్టాల్సిందిగా జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలిచ్చారు. పంచాయతీరాజ్ ఈఈ రామకృష్ణారెడ్డి, ప్రాజెక్టు డీఈఈ అన్యం రాంబాబు, విద్యుత్‌శాఖ ఎస్ఈ రాజేశ్వరి, ఏడీఈ అన్నవరం, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, డీఎల్డీవోలు ఓడలరేవు గ్రామాన్ని సోమవారం పరిశీలించి అభివృద్ధి పనుల కోసం చర్చించారు. బెండమూర్లంక నుంచి ఓడలరేవు వరకు ఏడు మీటర్ల వెడల్పున రోడ్డు అభివృద్ధికి, అదనపు రోడ్డు నిర్మాణానికి రూ.1.5 కోట్లు, ఓడలరేవు గ్రామంలో రూ.4.5 కోట్ల నిధులతో అంతర్గత సీసీ రోడ్ల అభివృద్ధికి, రిటైనింగ్ వాల్, రెండు కల్వర్టుల నిర్మాణానికి, విద్యుత్‌లైన్ల ఏర్పాటుకు అధికారుల బృందం క్షేత్రస్థాయి స్థల పరిశీలన చేశారు. ఎంపీడీవో గౌరీకుమారి, కొల్లు విష్ణుమూర్తి, మల్లాడి ఉమామహేశ్వరరావు, నాతి లెనిన్‌బాబు అధికారుల వెంట ఉన్నారు.

మరణం ముంగిట మహోపకారం!
- కాలేజీ బస్సు డ్రైవర్‌కు గుండెపోటు
- బస్సును పక్కకు ఆపి క్షణాల్లో మృతి
- 50 మంది విద్యార్థులు సురక్షితం
7



ప్రచార పోస్టర్లను విడుదల చేసిన కలెక్టర్ మహేష్‌కుమార్, లీడ్ బ్యాంకు మేనేజర్ కేశవవర్మ

మీ డబ్బు-మీ హక్కు పేరుతో ప్రచారం

బ్యాంకుల్లో క్లెయిమ్ చేయని సొమ్ములు తిరిగి పొందేందుకు వెసులుబాటు

ప్రచార గోడ పత్రికను విడుదల చేసిన కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వివిధ బ్యాంకుల్లో లావాదేవీలు జరగని బ్యాంకు ఖాతాల్లోని తిరిగి పొందేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వివరించారు. 'మీ డబ్బు-మీహక్కు నినాదంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా మూడు నెలలపాటు నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార కార్యక్రమంపై సోమవారం కలెక్టర్ గోడ పత్రికను బ్యాంకు అధికారులతో కలిసి ఆవిష్కరించారు. పదేళ్ల అంతకు మించి లావాదేవీలు జరగని బ్యాంకు ఖాతాల్లో సొమ్ములను బ్యాంకులు తిరిగి ఇవ్వడానికి నిర్ణయించాయని కలెక్టర్ పేర్కొన్నారు. దీని ద్వారా ఖాతాదారుల పేరు మీద ఉన్న క్లెయిమ్ చేయని, లేదా మరచిపోయిన ఆర్థిక ఆస్తులను తిరిగి పొందేందుకు అవకాశం కలిగిందన్నారు. బ్యాంకుల్లో డిపాజిట్లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్‌లు, బీమా పాలసీలు, ఇతర పెట్టుబడులు పెట్టడం ద్వారా స్తంభించి ఉన్న ఖాతాల్లోని సొమ్ములను తీసుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. బ్యాంకు అధికారులకు సరైన పత్రాలు సమర్పించడం ద్వారా వాటిని క్లెయిమ్ చేసుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. కోనసీమ జిల్లాలో 4,70,690 బ్యాంకు ఖాతాల్లో రూ.82.66 కోట్లు ఉన్నాయని వీటిలో వ్యక్తిగత ఖాతాలు 4,58,644 ఉండగా, వీరి ఖాతాల్లో రూ.66.27 కోట్లు ఉన్నాయని, సంస్థాపరమైన 6,984 ఖాతాలు ఉండగా, ఈ ఖాతాల్లో రూ.12.26 కోట్లు ఉన్నాయని, ప్రభుత్వ రంగంలో 5,062 బ్యాంకు ఖాతాల్లో రూ.4.13 కోట్లు ఉన్నాయని, వీటికి సంబంధించిన వ్యక్తులు, సంస్థల ప్రతినిధులు సరైన పత్రాలతో ఈకేవైసీ పూర్తిచేసి తమ సొమ్మును తిరిగి పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లా లీడ్ బ్యాంకు అధికారి కేశవవర్మ, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.



ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో మాధవి, ఇతర అధికారులు

నేడు ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు సీఎం శంకుస్థాపన

ఉప్పలగుప్తం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం పంచాయతీ గోడివారిపేటలో ఏర్పాటు చేసే ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు. ఈ కాంప్లెక్స్ ఏర్పాటు ద్వారా కొబ్బరి, కోకో, మత్స్య సంపదకు సంబంధించి ముడిసరుకు విలువ ఆధారిత పారిశ్రామిక అభివృద్ధికి అవకాశాలుంటాయి. దీంతో స్థానికంగా ఉద్యోగావకాశాలు ఏర్పడతాయి. ఈ సందర్భంగా సోమవారం రాత్రి అమలాపురం ఆర్డీవో కె.మాధవి ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి రాంబాబు, సర్పంచ్ కడిమి చిన్నవరాజు, తహసీల్దార్ వాసా దివాకర్, డిప్యూటీ తహసీల్దార్ జి.లలిత, ఏపీవో ఎం.వీరబాబు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.



సైన్సును.. విందాం.. కందాం!

అనంత విశ్వం, భూగోళం, ఖగోళం, సముద్రాల లోతు, ప్రపంచ దేశాలు, అక్కడి వాతావరణ పరిస్థితులు.. కొండలు, కోనలు.. జంతువులు, భూమి, నీరు, మంచు.. ఇలా ఒకటేమిటి ఒక్కసారిగా ప్రపంచంలోని అన్నింటి గురించి వినొచ్చు.. చూడొచ్చు.. అంటే ప్రపంచాన్నే చుట్టివచ్చేయొచ్చన్న మాట.. దీనికి ఎక్కడికో వెళ్లక్కర్లేదు. రాజమహేంద్రవరం సైన్స్ సెంటర్‌కి వెళ్తే చాలు.. ఇక్కడి గ్యాలరీల్లో వాటన్నింటినీ వర్చువల్‌గా చూడొచ్చు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల విద్యార్థులకు ఉపయోగపడేలా రాజమహేంద్రవరంలోని బొమ్మూరులో విజ్ఞాన కేంద్రం(సైన్స్ మ్యూజియం)ను నిర్మించారు.

అటు వినోదం.. ఇటు విజ్ఞానం

- విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా రాజమహేంద్రవరం ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం
- బొమ్మూరులో ఐదెకరాల స్థలంలో ఏర్పాటు
- ప్రపంచంలోని అనేక విషయాలపై పరిజ్ఞానం
- సైన్స్ సెంటర్‌కు తరలివస్తున్న విద్యార్థులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం విజ్ఞాన కేంద్రం(సైన్స్ మ్యూజియం) విద్యార్థులను బాగా ఆకర్షిస్తోంది. ప్రతిరోజూ ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలనుంచి విద్యార్థులు వచ్చి ఈ కేంద్రాన్ని సందర్శించి ఉత్సాహంతో వెళ్తున్నారు. విద్యార్థులు ప్రయోగాలు చేయడానికి అనుకూలమైన మ్యూజియంఇది. ఇక్కడ వినోదంతోపాటు విజ్ఞానం కూడా పొందవచ్చు. ఇక్కడ పెద్ద విజ్ఞాన పార్కు కూడా ఉండడంతో అందరూ సంతోషంగా ఆడుకుంటున్నారు. ఈ ప్రాంతీయ విజ్ఞాన కేంద్రాన్ని గత జూన్ 26న కేంద్రమంత్రి షెకావత్, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రారంభించగా ఎంపీ పురందేశ్వరి, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు పాల్గొన్నారు. సైన్సు సెంటర్‌పై మొదట్లో అంతగా ప్రచారం లేక ప్రజల్లోకి అంతగా వెళ్లలేదు. ఇటీవల దీనిపై అవగాహన పెరగడంతో తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలల నుంచి ప్రతిరోజూ ఏదో పాఠశాలనుంచి విద్యార్థులు వస్తున్నారు. ఇక్కడ ఉండే వాటిపై పూర్తిగా వివరించి చెప్పేవారు ఉంటే విద్యార్థులకు మరింత ఉపయుక్తంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



ఎన్నెన్నో వింతలు

ఈ విజ్ఞాన కేంద్రాన్ని ఐదెకరాల స్థలంలో రూ.10 కోట్లతో నిర్మించారు. ఈ సైన్స్ కేంద్రం ఓఅద్భుతం..సైన్స్ పరికరాలు,జ్ఞాన సమాచారం.. ప్రయోగశాలలు ఏర్పాటుచేశారు. ఈ భవనాన్ని జీప్లస్ -1గా నిర్మించారు.గ్రౌండ్ ఫ్లోర్‌లో మూడు రూమ్‌లున్నాయి. ఫస్ట్ ఫ్లోర్‌లో ఆరు గ్యాలరీలున్నాయి. ఆడిటోరియం, కాన్ఫరెన్స్ హాల్ ఉంది. సాంకేతికపరమైన 18ఎగ్జిబిషన్లు ఉన్నాయి. ఓపెన్ గ్రౌండ్‌లో సైన్స్ పార్కు ఉంది. రన్నియాన్స్ గ్యాలరీలో ఫిజిక్స్, మాథ్స్‌కి సంబంధించిన 33 విజ్ఞాన అంశాలు ఉన్నాయి. అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ కోసం మరో నిర్మాణం కూడా చేయనున్నారు. వాటర్ వర్రీస్ గ్యాలరీలో వర్చువల్ మ్యూజియం, మరో 35ఎగ్జిబిషన్లు ఉన్నాయి.సౌండ్, చిత్రాల సేకరణ, ఖగోళ వస్తువులు, సాంకేతిక,శాస్త్రీయ, పారిశ్రామిక పురోగతికి సంబంధించిన 32 ప్యానెళ్లు ఉన్నాయి. ఎ జర్నీ విత్ లైట్ బై స్పేస్, గెలాక్సీ గ్రహాలతో కూడిన 20 ప్యానెల్స్ ఉన్నాయి.



పలు అంశాలను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు



ఏపీసీఓఎస్‌టీ నిర్వహణలో..

కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియంలోని ఒక యూనిట్ అయిన విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజికల్ మ్యూజియం, స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ కల్చర్ ఆఫ్ సైన్స్(ఎస్‌పీఓసీఎస్) పథకం కింద ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఏపీసీఓఎస్‌టీ) ఆధ్వర్యంలో దీన్ని నిర్మించారు. ప్రస్తుతం ఇది ఏపీసీఓఎస్‌టీ ఆధ్వర్యంలో నిర్వహణలో ఉంది.

రోజూ సందడి

విద్యార్థులతో ఇక్కడ రోజూ సందడిగానే ఉంటుంది. జూన్‌నుంచి ఇప్పటివరకూ 25వేలమందికిపైగా ఈ కేంద్రాన్ని సందర్శించినట్టు ఇక్కడ ఇన్‌చార్జి అయిన డీఈవో ఎం.దుర్గాప్రసాద్ నాయక్ తెలిపారు. మ్యూజియం కోఆర్డినేటర్‌గా ఓ డీఈవో అధికారి ఉన్నారు. ఆయనతో పాటు మరో ముగ్గురు డీఈవోలుకూడా ఉన్నారు. వీరే ఎడ్యుకేషనల్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తున్నారు

- ప్రతి సోమవారం సెలవు

ఈసైన్స్ మ్యూజియం ప్రతిరోజూ ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుంది. ప్రతి సోమవారం సెలవు.

- టికెట్ వివరాలు

పాఠశాల విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.25, ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు రూ.40, ప్రైవేట్ స్కూల్ విద్యార్థులకు రూ.40, కాలేజీ విద్యార్థులకు రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారు. ప్రజలకు కూడా అనుమతి ఉంది. పెద్దలకు రూ.50, పిల్లలకు ఒక్కొక్కరికి రూ.25 వంతున వసూలు చేస్తున్నారు.

- ఇలా వెళ్లాలి..



సైన్స్ సెంటర్‌కు రాజమహేంద్రవరం నుంచి మోరంపూడి హైవే మీదుగా బొమ్మూరు వద్ద రాజవోలు మార్గంలో లోపలికి వెళ్లాలి.



మంచుకొండలపై ఉండే పరిస్థితులు తెలిసేలా చేసిన ఏర్పాటు



సౌండ్‌పై అవగాహన పొందుతున్న విద్యార్థులు



కరప మండలం వాకాడలోని రామాలయం ఆవరణలో రెండు భారీ టవర్ ఆకృతులపై ఆకట్టుకుంటున్న దీపాల వరుస





దీపాలు వెలిగిస్తున్న ఎమ్మెల్యే నానాజీ, యువతులు

కనుల పండువగా..
కోటి దీపాల సంబరం!

- కరప మండలం వాకాడలో ఘనంగా నిర్వహణ
- రెండు భారీ టవర్ ఆకృతులపై దీపాలు వెలిగించిన మహిళలు

కరప, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వాకాడలో సోమవారం రాత్రి కోటి దీపాల సంబరం ఘనంగా జరిగింది. రామాలయం ఆవరణలో కర్రలు, చెక్కలతో రెండు భారీ టవర్ ఆకృతులను నిర్మించారు. వాటి మధ్య అరల్లో మట్టి ప్రమిదలను ఉంచి వాటిలో నూనె పోసి తెల్లవార్లు కోటి దీపాలను వెలిగించారు. సంబరానికి విచ్చేసిన మహిళలు ఒత్తులను వెలిగించి పూజలు చేశారు. నిర్వాహకులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసి సంబరాన్ని రక్తికట్టించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిమంది తరలివచ్చి తిలకించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కరప ఎస్ఐ తోట సునీత ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, వేములవాడ సొసైటీ ఛైర్మన్ దూడల నారాయుడు, సర్పంచ్ అడబాల సత్యప్రసాద్, ఆయా పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు కార్తీక దామోదరుడిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో దీపాలను వెలిగించారు.





ఆలయ ఆవరణలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్న కళాకారులు

జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో
రంగంపేట విద్యార్థినులకు రజత పతకం

రంగంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో తూర్పు గోదావరి జిల్లా రంగంపేట జడ్పీ హైస్కూలు విద్యార్థినులు రజత పతకం సాధించారని ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి సోమవారం తెలిపారు. ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో ఎస్‌వోఎస్‌టీసీ (ఢిల్లీ) ఆధ్వర్యంలో ఇండియన్ యంగ్ ఇన్నోవేటర్స్ అండ్ ఇన్వెన్షన్ చాలెంజ్ పేరిట నిర్వహించిన జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రాజెక్టుల ప్రదర్శన, పోటీలో దేశవ్యాప్తంగా 70 ప్రాజెక్టులను ఎంపిక చేశారు. ఇందులో రంగంపేట విద్యార్థినులు బి.పల్లవి, ఎం.జాహ్నవి రూపొందించిన బయోమెట్రిక్ మెషిన్ కూడా ఉంది. దీనికి రజత పతకం దక్కింది. విద్యార్థినులతో పాటు వారికి గైడ్‌గా వ్యవహరించిన జీవశాస్త్ర ఉపాధ్యాయిని వి.రమ్యసుధను ఎంఈవోలు కె.శ్రీనివాసరావు, పి.మధుసూదనరావు, హెచ్ఎం పార్థసారథి, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థినులను, ఉపాధ్యాయిని రమ్యసుధను అభినందిస్తున్న హెచ్ఎం పార్థసారథి

జాతీయ స్థాయి స్క్వాష్ పోటీలకు 'ఆదిత్య' విద్యార్థినుల ఎంపిక

కాకినాడ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆదిత్య శ్రీనగర్ పాఠశాల 10వ తరగతి విద్యార్థిని నడింపల్లి రూపశ్రీ, 8వ తరగతి విద్యార్థిని పిల్లా బ్లెస్సీ షానోన్ జాతీయ స్థాయి స్క్వాష్ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ టి.రమేష్ తెలిపారు. న్యూఢిల్లీలోని త్యాగరాజు మైదానంలో వచ్చే ఏడాది జనవరి 10 నుంచి 15వ తేదీ వరకు జరిగే పోటీల్లో వారు పాల్గొంటారని ఆయన చెప్పారు. ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ శృతిరెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థినులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారిణిలను ఆదిత్య విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ శృతిరెడ్డి, ప్రిన్సిపాల్ రమేష్, వైస్ ప్రిన్సిపాల్ విజయఉమాపతి అభినందించారు.



రూపశ్రీ, బ్లెస్సీ షానోన్





రష్యన్ హౌస్‌లో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తమన్నా... విద్యార్థిని అభినందించి ప్రశంసాపత్రం అందజేస్తున్న రష్యా శాస్త్రవేత్త ఓల్గా గాబ్రియేల్

జాతీయ స్థాయి సైన్స్ సెమినార్‌లో సామర్లకోట విద్యార్థిని తమన్నా

సామర్లకోట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి ఎక్స్‌ప్లోర్ సైన్స్ సెమినార్‌లో కాకినాడ జిల్లా సామర్లకోట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని ఎండీ తమన్నా కాటూన్ సత్తా చాటిందని సామర్లకోట ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పట్టపగలు పుల్లయ్య పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 52 మంది విద్యార్థులు ఎంపిక కాగా కాకినాడ జిల్లా నుంచి తమన్నా మాత్రమే ఉందన్నారు. ఆమెకు న్యూఢిల్లీలోని రాకెట్ ఇంజనీరింగ్ కళాశాల, రష్యన్ హౌస్, రాష్ట్రపతి భవన్, నెహ్రూ ప్లానిటోరియం, నేషనల్ సైన్స్ ఎగ్జిబిషన్, నేషనల్ మ్యూజియం చూపించారు. కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు తమన్నాకు బహుమతి, ప్రశంసాపత్రం అందజేశారు. సోమవారం సామర్లకోట చేరుకున్న విద్యార్థిని ఎంఈవోలు, ఉపాధ్యాయులు అభినందించారు.

శంభో హరహర నమో నమో

శివశివ శంకర భక్తవశంకర శంభో హర హర నమోనమో అంటూ భక్తులు కైలాసవాసుడిని దర్శించుకుని పరవశులయ్యారు. కార్తీక మాసం మూడో సోమవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునే ఆలయాలకు వెళ్లి క్యూలైన్లలో బారులు తీరి శివుడిని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం జాంపేట ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో శివుడే ప్రత్యక్షమైనట్టుగా స్వామికి విశేష అలంకరణ



కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడలో భస్మాభిషేకం అనంతరం ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మురమళ్లలో వీరేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం



కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో అరుణాచలేశ్వరస్వామికి అన్నాభిషేకం



కాకినాడ భానుగుడిలోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో స్ఫటిక లింగానికి అభిషేకం చేస్తున్న భక్తురాలు



కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు



కాకినాడ జిల్లా సామర్లకోటలో కుమారరామ భీమేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

మరణం ముంగిట మహోపకారం!

- కాలేజీ బస్సు డ్రైవర్‌కు గుండెపోటు
- బస్సును పక్కకు ఆపి క్షణాల్లో మృతి
- 50మంది విద్యార్థులు సురక్షితం



ప్రాణాలు వదిలిన డ్రైవర్ నారాయణరాజు



ఆలమూరు మండలం మడికి వద్ద జాతీయ రహదారిపై ఆపివేసిన బస్సు

ఆలమూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాలేజీ బస్సు డ్రైవర్‌కు ఆకస్మికంగా గుండెపోటు వచ్చింది. అయితే ఆ క్షణం తన కోసం కాకుండా విద్యార్థులను రక్షించాలనే ఆలోచనతో బస్సును పక్కకు ఆపి మరుక్షణం స్టీరింగ్‌పై వాలి డ్రైవర్ ప్రాణాలు వదిలాడు. ఈ సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి వద్ద జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళ్లితే.. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీ బస్సు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం గంటి నుంచి బయలుదేరింది. రాజమహేంద్రవరానికి 50మంది విద్యార్థులను ఆలమూరు మండలం మడికి గ్రామానికి చెందిన దెందుకూరి నారాయణరాజు (60) అనే డ్రైవర్ తీసుకువెళుతున్నారు. మడికి దాడిన వెంటనే డ్రైవర్‌కు గుండెపోటు రావడంతో తక్షణం బస్సును పక్కకు ఆపి స్టీరింగ్‌పై పడిపోయాడు. దీంతో విద్యార్థులు ఒక్కసారిగా భయభ్రాంతులై బస్సు నుంచి దిగిపోయారు. వెంటనే నారాయణరాజుకు సీపీఆర్ చేసి అంబులెన్స్‌కు ఫోన్ చేయగా అప్పటికే ప్రాణాలు విడిచినట్టు స్థానికులు చెప్తున్నారు. తాను చనిపోతూ 50మంది విద్యార్థులకు చిన్నపాటి హాని జరగకుండా చేసిన డ్రైవర్ నారాయణరాజుకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

క్యారేజీ తీసుకున్న 5 నిమిషాలకే..

దాదాపు 40ఏళ్లుగా డ్రైవర్ వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న నారాయణరాజుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. నారాయణరాజు ప్రతీ రోజు ఉదయమే క్యారేజీ పట్టుకుని డ్రైవింగ్‌కు వెళ్తాడు. సోమవారం ఉదయం అతడు బయలు దేరే సమయానికి వంట పూర్తి కాకపోవడంతో తాను రోడ్డుమీదకు తీసుకొచ్చి క్యారేజీ అందిస్తానని భార్య చెప్పడంతో నారాయణరాజు వెళ్లిపోయ్యాడు. గంటి బయలుదేరి వచ్చి మడికి వద్ద భార్య చేతులమీదుగా క్యారేజీ తీసుకున్న ఐదు నిమిషాల వ్యవధిలోనే గుండెపోటు వచ్చిన భర్త చనిపోవడంతో భార్య బేబి బోరున విలపిస్తుంది.

రద్దీగా రత్నగిరి...

» కార్తీక సోమవారం 8645 వ్రతాలు » రూ.80 లక్షల ఆదాయం

అన్నవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి కార్తీక సోమవారం పర్వదినం పురస్కరించుకుని భక్తజనంతో నిండిపోయింది. రద్దీ నేపథ్యంలో ఒంటిగంట నుంచి వ్రతాలు, 2గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఒక్కరోజు 8645 జంటలు వ్రతాలు ఆచరించుకోగా వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.85 లక్షల ఆదాయం ఆలయానికి లభించింది. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈవో సుబ్బారావు, ఛైర్మన్ రోహిత్ వేర్వేరు ప్రదేశాల్లో ఉండి పర్యవేక్షణ చేస్తూ ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం మహిళా భక్తులు రావిచెట్టు వద్ద కార్తీకదీపాలు వెలిగించారు. సత్యదేవ నిత్యాన్నదాన పథకం ద్వారా 30 వేలమందికి నిరంతరాయంగా ఉచిత పులిహోర పంపిణీ చేశారు.



వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు



పీఠాధిపతికి వేదాశీర్వచనం అందిస్తున్న పండితులు

పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి పూజలు

సత్యదేవుడి సన్నిధిలో పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి శ్రీ ప్రజానంద సరస్వతి బాలాజీ స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

రూ.లక్ష విరాళం

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి వీరంపాలెనికి చెందిన బొల్లారెడ్డి రామకృష్ణారెడ్డి రూ.లక్ష విరాళాన్ని ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించి వారికి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యాలు కల్పించారు.



కాలేజీ నుంచి ఇంటికెళ్తుండగా...

బస్సు ఢీకొని విద్యార్థి మృతి



శంకర్ (ఫైల్)

కాకినాడ క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓ కళాశాల బస్సు ఢీకొని అదే కళాశాలకు చెందిన విద్యార్థి దుర్మరణం చెందిన సంఘటన సోమవారం కాకినాడలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ దుమ్ములపేటకు చెందిన కంబాల యువన్ శంకర్ (17) స్థానిక పోస్టల్‌కాలనీలో ఉన్న శ్రీచైతన్య క్యాంపస్‌లో ఇంటర్మీడియట్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అతడి తండ్రి మల్లేశ్వరరావు చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. అయితే శంకర్ సోమవారం సాయంత్రం కళాశాల ముగిశాక 5.50 గంటలకు తన స్కూటీపై స్నేహితుడైన మోజస్‌ను ఎక్కించుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో సాంబమూర్తినగర్ 5వ వీధి ఆదిత్య ఉమెన్స్ డిగ్రీ కళాశాల సమీపంలోకి వచ్చేసరికి స్కూటీ అదుపు తప్పడంతో మోజస్ ఎడమపక్కకు పడిపోగా, శంకర్ కుడి పక్కకు పడిపోయాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న కళాశాల బస్సు టైర్ శంకర్ ఛాతీపైకి ఎక్కడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. వెంటనే మోజస్ స్థానికుల సహాయంతో జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్టు జీజీహెచ్ అత్యవసర విభాగ వైద్యులు తెలిపారు. కాకినాడ త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిచ్చికుక్క ఎంత పనిచేసింది!

దాడిలో మూడేళ్ల బాలుడికి గాయాలు

చికిత్స పొందుతూ మృతి



భరత్ (ఫైల్)

గొల్లప్రోలు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బయట ఆడుకుంటున్న మూడేళ్ల చిన్నారిపై పిచ్చి కుక్క దాడి చేసి విచక్షణారహితంగా గాయపరిచింది. చికిత్స చేయించారు. మళ్లీ అకస్మాత్తుగా అస్వస్థతకు గురికావడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్చగా సోమవారం మరణించాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ కొలిపే బుల్లబ్బాయి మనుమడు, నాగేశ్వరరావు రత్నశ్రీ దంపతుల ఏకైక కుమారుడు అయిన భరత్(3) అక్టోబరు 16న ఇంటి బయట ఆడుకుంటున్నాడు. ఆ సమయం లో పిచ్చికుక్క దాడి చేసి విచక్షణారహితంగా కరిచింది. ఈ దాడిలో గాయపడ్డ భరత్‌ను ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి ఏఆర్‌వీ ఇంజక్షన్లతో పాటు చికిత్స చేయించారు. కోలుకుంటున్న తరుణంలో ఆదివారం మళ్లీ అస్వస్థతకు గురికాగా కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మరణించాడు. తమ ఏకైక కుమారుడు పిచ్చికుక్క దాడిలో గాయపడి మరణించడంతో నాగేశ్వరరావు, రత్నశ్రీ దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ముక్కుపచ్చలారని బాబు మరణించడాన్ని వారితో పాటు గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు.

నివారణ చర్యలు ఏవి..?

గ్రామంలో కొంతకాలంగా పిచ్చికుక్కల బెడద అధికంగా ఉంది. బాలుడిని కరిచి గాయపరిచిన కుక్క 2రోజుల వ్యవధిలో పలువురిని గాయపరిచింది. వీరంతా పెద్దవారు కావడంతో చికిత్స పొంది కోలుకున్నారు. ఆ పిచ్చికుక్కను గ్రామస్తులు కొట్టి చంపివేశారు. అయితే 2 కొద్దిరోజులుగా కుక్కలు పలువురిని గాయపరుస్తున్నాయి. వీటిని నియంత్రణకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుక్కలను నియంత్రించి ఉంటే బాలుడు బతికి ఉండేవాడని పేర్కొంటున్నారు.

ప్రతీ రైతుకు అండగా ప్రభుత్వం

శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు



అనపర్తి మండలం కుతుకులూరులో ప్రసంగిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

అనపర్తి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. సోమవారం తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరు సొసైటీ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి ప్రారంభించారు. యంత్రం ద్వారా తేమ కొలిచే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో స్పీకర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 3217 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం కాగా ఇప్పటికే 1612 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 46మండలాల్లో 20137 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ప్రతీ రైతుకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన ప్రతీ రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని, పంట నష్టం అంచనా వేసేందుకు కేంద్ర బృందాలు పర్యటించనున్నాయని నివేదిక అందిన వెంటనే కేంద్రం సహాయంతో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం ప్రకటిస్తుందన్నారు. టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్‌పర్సన్ జుత్తుగ సూర్యకుమారి, ఆళ్ల గోవిందు, కర్రి శేషారత్నం, కర్రి సత్యగౌరి, బేరా వేణమ్మ, సొసైటీ ఛైర్మన్లు నల్లమిల్లి సుబ్బారెడ్డి, దత్తుడు శ్రీను, కరకుదురు దత్తుడు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకుని వచ్చేలోపు చీరతో ఉరేసుకుని..

కాకినాడలో యువకుడి ఆత్మహత్య



రాజు (ఫైల్)

కాకినాడ క్రైం, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం కాకినాడలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. కాకి నాడ జగన్నాథపురం నర్సింహ రోడ్డు పూర్వం వారి వీధికి చెందిన దండుప్రోలు రాజు (21) రెండేళ్ల వయస్సులోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. అప్పటి నుంచి నానమ్మ శుభ వద్దనే పెరిగాడు. ప్రస్తుతం డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. రాజు గత మూడేళ్లుగా తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెం దిన ఓ యువతిని ప్రేమించాడు. ఇటీవల వారిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో మనస్తాపానికి గురై 10 రోజుల క్రితం ఎలుకల మందు తాగాడు. అయితే కుటుంబీకులు సకాలంలో ఆసుపత్రిలో చేర్చడంతో ప్రాణాపాయం తప్పింది. రాజు బాగుంటే కోటిపల్లి శివాలయానికి వస్తామని నానమ్మ, మేనత్త మొక్కుకున్నారు. సోమవారం రాజును ఇంటిలో ఉంచి మొక్కు తీర్చుకునేందుకు వెళ్లారు. మొక్కు తీర్చుకుని సాయంత్రం వచ్చి చూసేసరికి రాజు ఇంటి దూలానికి చీరతో ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమవ్వాలి

పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి యోగ్యమైన కేసులు పెద్ద సంఖ్యలో పరిష్కారం కావాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. డిసెంబరు 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ని పురస్కరించుకుని న్యాయమూర్తులతో సోమవారం ఆమె సమావేశమయ్యారు. కేసుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల జాబితాను డీఎల్ఎస్ఏకి అందజేయాలని సూచించారు. అనంతరం ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించి తగు ఆదేశాలిచ్చారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మీ, నాలుగు జిల్లాల ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులకు సూచనలు ఇస్తున్న పీడీజే గంధం సునీత

కందరాడలో భారీ వృక్షానికి మంటలు

భయాందోళనకు గురైన ప్రజలు



కందరాడలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో భారీ వృక్షానికి అంటుకున్న మంటలు

పిఠాపురం రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కందరాడ గ్రామంలో భారీ వృక్షానికి అకస్మాత్తుగా మంటలు అంటుకున్నాయి. దీంతో ఆ మార్గంలో వెళ్లే ప్రజలు, వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ సమీపంలో గల ప్రైవేటు పాఠశాల ఎదురుగా ఉన్న భారీ వృక్షం మీదుగా కరెంటు తీగలు వెళ్తున్నాయి. అవి షార్ట్‌సర్క్యూట్ అవ్వడంతో మంటలు చెలరేగాయి. దీంతో పిఠాపురం-సామర్లకోట ఆర్అండ్‌బీ రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పిఠాపురం రూరల్ ఎస్ఐ జానీబాషా అక్కడకు చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. వాహనాలను ఎస్సీ కాలనీలోని రహదారుల మీదుగా మళ్లించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు.

షేక్ సుభానీకి రాష్ట్ర ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డు



షేక్ సుభానీ

మామిడికుదురు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయుడిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు జడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ షేక్ సుభానీ ఎంపికయ్యారు. మౌలానా అబుల్‌కలాం అజాద్ జయంతిని పురస్కరించుకుని ఈ అవార్డుకు సుభానీని రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఎంపిక చేసింది. మంగళవారం అబుల్‌కలాం అజాద్ జయంతిని పురస్కరించుకుని విజయవాడలో జరిగే కార్యక్రమంలో అవార్డును అందిస్తారని ప్రధానోపాధ్యాయుడు బి.చిరంజీవిరావు తెలిపారు. సుభానీని ఇతర ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

సోమవరం కారు ప్రమాద ఘటనలో నాలుగుకు చేరిన మృతుల సంఖ్య

మరో వ్యక్తి పరిస్థితి విషమం

కిర్లంపూడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరం గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఈనెల 8న పెళ్లికారు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. ముగ్గురు గాయపడ్డారు. గాయపడ్డ ముగ్గురిని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. అందులో జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామానికి చెందిన విద్యార్థి కూండ్రపు దుర్గచైతన్య చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్టు కిర్లంపూడి పోలీసులు తెలిపారు. దీంతో ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య నాలుగుకు పెరిగింది. అలాగే మరో వ్యక్తి భద్రం పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు.

అమలాపురంలో బాలిక కిడ్నాప్

కాకినాడ తీసుకెళ్లినట్టు గుర్తింపు

అమలాపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో ఐమెండ్ స్కూల్‌లో ఐదోతరగతి చదువుతున్న పదేళ్ల బాలిక సోమవారం సాయంత్రం కిడ్నాప్‌కు గురైన విషయం సంచలనంగా మారింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని మెయిన్‌రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు స్కూలులో వైసీపీ నాయకుడు కముజు రమణ కుమార్తె నిషిత (10) కిడ్నాప్ అయినట్టు పట్టణ పోలీసులకు సమాచారం అందింది. బాలికకు వరుసకు మేనమామ అయ్యే మట్టపర్తి మధు అనే వ్యక్తి సోమవారం సాయంత్రం స్కూలు వద్దకు వచ్చి బాలికను ఇంటికి తీసుకెళ్తానని చెప్పి మోటారుసైకిల్ ఎక్కించుకుని వెళ్లినట్టు స్థానికులు తెలిపారు. తన కుమార్తె ఇంకా ఇంటికి చేరలేదని విచారించగా మట్టపర్తి మధు స్కూలుకు వెళ్లి తీసుకెళ్లినట్టు తెలిసిందని కముజు రమణ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ వీరబాబు అప్రమత్తమై విచారణ చేపట్టారు. కముజు రమణకు ఇద్దరు కుమార్తెల్లో చిన్న కుమార్తె నిషితను సమీప బంధువుగా పేర్కొంటున్న మట్టపర్తి మధు మోటార్‌సైకిల్ ఎక్కించుకుని కాకినాడ వెళ్లినట్టు ప్రాథమికంగా పోలీసులు గుర్తించారు. కాకినాడలోని మొబైల్ షాపులో కొత్త ఫోన్, సిమ్ కొనుగోలు చేస్తున్న సమయంలో బాలిక ఏడవడంతో మధు ఫోన్‌తో పాటు సిమ్‌కార్డును వదిలి బాలికను తీసుకుని పరారైనట్టు పోలీసులకు ప్రాథమికంగా సమాచారం అందింది. దీంతో కాకినాడ, అమలాపురం నుంచి పోలీసు బృందాలు బాలిక ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు చేపట్టాయి.

సెంట్రల్ జైలులో ఇద్దరు జీవిత ఖైదీలకు క్షమాభిక్ష

ఆమోదం తెలిపిన క్యాబినెట్

రాజమహేంద్రవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అర్హులైన జీవిత ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించింది. సోమవారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో 27వ అంశంగా హోంశాఖలోని జైళ్లశాఖ చెందిన అంశాన్ని ప్రవేశపెట్టారు. దీనిలో ముగ్గురు జీవిత ఖైదీలకు క్షమాభిక్ష కల్పించాల్సి ఉంది. దీనికి జీవో ఎంఎస్ నెం.71 నిర్దేశించిన ప్రకారం మంత్రి మండలి ఆమోదం తెలిపింది. దీనిలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి సెంట్రల్‌లో జీవిత ఖైదు అనుభవిస్తున్న మధిరి సువర్ణరాజు, కటికిరెడ్డి నాగేశ్వరరావు విడుదల కానున్నారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలేనికి చెందిన నాగేశ్వరరావు ఓ రైస్ మిల్లులో పని చేస్తుండేవాడు. కలెక్షన్ ఏజెంట్‌ను హత్య చేసి సొమ్ము దోపిడీ చేశారనే నేరంపై రాజమండ్రిలోని కోర్టు జీవిత ఖైదు విధించగా 2011 మార్చి 21న జైలుకు వచ్చాడు. ఇతడు ఇప్పటి వరకూ పర్లో, పేరోల్‌పై బయటకు కూడా వెళ్లలేదు. అలాగే కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం చంద్రాల గ్రామానికి చెందిన మదిరి సువర్ణరాజు భార్యను హత్య చేసిన కేసులో 2010 జూలై 15 నుంచి జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. ఇతడి ప్రవర్తన ఆధారంగా సెమీ ఓపెన్ ఎయిర్ జైలు అర్హత పొందాడు. అయితే ప్రభుత్వం జీవో 2రోజుల్లో ఇచ్చే అవకాశం ఉంది. ఆ జీవో ఆధారంగా వీళ్లిద్దరూ స్వేచ్ఛా వాయువులు పీల్చుకొని కుటుంబాల చెంతకు చేరనున్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

గోకవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.15,000 జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి తీర్పు వెలువరించినట్టు ఎస్ఐ పి.పవన్‌కుమార్ తెలిపారు. గోకవరం మండలం బావాజీపేటకి చెందిన విరోతి శ్రీను భార్యతో అదే గ్రామానికి చెందిన బలిజ శ్రీను వివాహేతర సంబంధం ఏర్పరచుకున్నాడు. ఈ క్రమంలో విరోతి శ్రీను అడ్డును తొలగించుకోవాలనే ఉద్దేశంతో 2020 డిసెంబరు 30న తెల్లవారుజామున 5.30 గంటలకు పొలం పనుల నిమిత్తం బలిజ శ్రీను విరోతి శ్రీనును రంపయర్రంపాలెం తోటలోకి తీసు కెళాడు. అక్కడ బండ రాయితో శ్రీనును తల పై కొట్టి హత్య చేశాడు. ఈ సంఘటనపై మృతుడి సోదరుడు విరోతి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో ఎస్ఐగా పని చేసిన పి.చెన్నారావు కేసు నమోదు చేయగా అప్పటి కోరుకొండ సీఐ పితా.పవన్‌కుమార్‌రెడ్డి నిందితుడిని అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. తదనంతరం నేరం రుజువు కావడంతో బలిజ శ్రీనుకు జీవిత ఖైదు, రూ.15,000 జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి ఎం.మాధురి తీర్పు ఇచ్చినట్టు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

పుస్తెలతాడు చోరీ

కాట్రేనికోన, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కుండలేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన మహిళ మెడలోని 7 కాసుల బంగారు పుస్తెలతాడును బైక్‌పై వచ్చిన దుండగుడు లాక్కెళ్లాడు. నల్లజర్ల మండలం చోడవరం నుంచి ఆర్యవైశ్య సంఘం తరఫున నలభై మంది బస్సులో వచ్చారు. పుష్కరఘాట్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ఆగంతకుడు గుళ్ళపూడి రత్నకుమారి మెడలోని బంగారు పుస్తెలతాడును లాక్కుని పరారయ్యాడు. పోలీసులు వచ్చి వివరాలు సేకరించారు.

అన్నదాన పథకానికి విరాళం

ఆత్రేయపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి రాజమహేంద్రవరం జైన్ రోడ్డుకు చెందిన ఎస్‌వీఎస్ ఆటో మోటివ్స్ అధినేత డి.శ్రీధర్- పద్మజ దంపతులు రూ.1,40,999 విరాళం సమర్పించారు. దాతలకు ఈవో స్వామివారి చిత్రపటం అందజేశారు.

పలివెలలో ప్రత్యేక పూజలు

కొత్తపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పలివెల శ్రీఉమాకొప్పిలింగేశ్వరస్వామి ఆలయం కార్తీక మూడో సోమవారం శివనామస్మరణతో మార్మోగింది. భక్తులు భక్తిశ్రద్ధలతో ఆదిదేవుడైన పరమేశ్వరుడిని ఆరాధించారు. తెల్లవారుజాము నుంచే విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

- శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- అభిషేకాలు, ప్రత్యేక పూజలు



ముమ్మిడివరం:ఉమాసూరేశ్వరస్వామి ఆలయంలో పూజలు, అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలో భక్తుల రద్దీ

ముమ్మిడివరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడో సోమవారం మండలంలోని శైవ క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ముమ్మిడివరంలోని ఉమాసూరేశ్వరస్వామి, కొమానపల్లిలోని పార్వతీ సమేత చోడేశ్వర, లోకేశ్వరస్వామి, అయినాపురంలోని ఉమాసోమేశ్వరస్వామి, అన్నంపల్లి పార్వతీగౌతమేశ్వరస్వామి, కొత్తలంక ఉమాభోగేశ్వరస్వామి, క్రాపచింతలపూడి ఉమావల్లభేశ్వరస్వామి, ఠాణేలంక ఉమాసోమేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ఆయా ఆలయాల్లో సోమవారం తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెంలోని శ్రీహరిసాకేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపించారు. అలాగే అరుణాచలేశ్వరుడికి గిరి ప్రదక్షిణ నిర్వహించి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అయినవిల్లి,(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడో సోమవారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శైవ క్షేత్రాలు తెల్లవారుజాము నుంచి భక్తులతో కిక్కిరిశాయి. అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయం, శ్రీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరాలయం, ముక్తేశ్వరంలో గల శ్రీముక్తికాంత క్షణముక్తేశ్వరాలయం, శ్రీరాజరాజేశ్వరి సమేత శ్రీముక్తీశ్వరాలయం భక్తులతో కిక్కిరిశాయి. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

కాట్రేనికోన,(ఆంధ్రజ్యోతి): సోమవారం కుండలేశ్వరంలోని పార్వతీమల్లేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కుండలేశ్వరానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో టీడీపీ నాయకుడు పీఎస్‌ఎన్ రాజు భక్తులకు ఉచిత ఆటోలు ఏర్పాటు చేశారు.

అంబాజీపేట,(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడో సోమవారం మండలంలోని ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. వేకువజాము నుంచి శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఏకాదశ రుద్రుల స్వామివార్ల దర్శనానికి తరలివచ్చారు. శివుడ్ని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. మాచవరంలోని శ్రీపార్వతీ రాజేశ్వరస్వామి ఆలయంలో మాస లక్షబిల్వార్చన పూజ నిర్వహించారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): పురాణ ప్రసిద్ధి పొందిన రామేశ్వరం, లక్ష్మణేశ్వరం శివాలయాలతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాల్లో కార్తీక పూజలు, అభిషేకాలకు భక్తులు పోటెత్తారు. ఎం.రామేశ్వరం పార్వతీ రామేశ్వర శివాలయంలో చైర్మన్ అంగాని రామారావు ఆధ్వర్యంలో పుల్లేటికుర్తి ఫణి, ఉమాశంకర్ పర్యవేక్షణలో రామేశ్వరునికి పండ్లరసాలు, నదీ జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అల్లవరానికి చెందిన రాజులపూడి బంగార్రాజు, సాయిలక్ష్మణ్, కృష్ణ కుటుంబ సభ్యుల ఆర్థికసాయంతో అన్నసమారాధన జరిగింది. లక్ష్మణేశ్వరం, అల్లవరం, దేవగుప్తం, బోడసకుర్రు, గోడిలంక, గోడి, బెండమూర్లంక, కొమరగిరిపట్నం, యెంట్రుకోన, తాడికోన శివాలయాల్లో వేకువజాము నుంచి శివాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయ. శివ భక్తులు, ముఖ్యంగా మహిళలు శివాలయాలను సందర్శించారు.

ఐ.పోలవరం, (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడో సోమవారం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరాస్వామి ఆలయం శివనామ స్మరణతో మార్మోగింది.. వేకువజాము నుంచి భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలాచరించి, పరమశివుడి దర్శనం కోసం బారులు తీరారు. ఆలయం వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. తాగునీరు, వైద్య శిబిరం వంటి సౌకర్యాలు కల్పించారు. స్థానిక క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో భక్తులకు భోజన వసతి కల్పించారు. ఆలయం వద్ద ఏర్పాట్లను ట్రస్టు బోర్డు చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, అసిస్టెంట్ కమీషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షించారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఆర్.ఏనుగుపల్లి శివారు కారుపల్లిపాడులో శ్రీపార్వతి సోమేశ్వరస్వామి ఆలయం, పి.గన్నవరం గరుడేశ్వరస్వామి ఆలయం, మొండెపులంక శ్రీ పార్వతి రామలింగేశ్వరస్వామిఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు తెల్లవారుజాము నుంచి స్థానిక శివాలయాల్లో మహిళలు కార్తీక దీపారాధనలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కళకళలాడాయి. నరేంద్రపురం, కుందాలపల్లి, బెల్లంపూడి, మానేపల్లి, ముంగండ, ఉడిమూడి, గంటిపెదపూడి తదితర గ్రామాల్లో శివాలయాలు వద్ద తెల్లవారుజాము నుంచే ప్రత్యేకపూజలు, అభిషేకాలు చేశారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): అంతర్వేది పుణ్యక్షేత్రంలో కార్తీక సోమవారం సందర్భంగా క్షేత్ర పాలకుడు శ్రీపార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో భక్తులు వేకువజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు జరిపించుకున్నారు. అనంతరం నందీశ్వరుడి వద్ద దీపారాధనలు వెలిగించారు. అలాగే లక్ష్మీనరసింహస్వామి ఆలయం, శివాలయంలో భక్తులు దర్శనానికి బారులు తీరారు. అలాగే కృతకృత్యరామలింగేశ్వరస్వామి, ఉమారామలింగేశ్వరస్వామిఆలయల్లో కార్తీక సోమవారం పూజలు చేశారు. అంతర్వేది క్షేత్ర పాలకుడి ఆలయంలో ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీవల్లీదేవసేన షణ్ముఖ సుబ్రహ్మేశ్వరస్వామికి మంగళవారం ఉదయం ప్రత్యేక అభిషేకాలు జరగనున్నాయని అర్చకులు తెలిపారు. శ్రీషణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారికి అభిషేకాలు చేసుకునే భక్తులు కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా భావిస్తున్నారని అర్చకులు తెలిపారు.

యానాం, (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సోమవారం యానాంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక గౌతమిగోదావరి పుష్కరఘాట్‌కు మహిళలు తరలివచ్చారు. కార్తీక దీపాలువెలిగించి గోదావరిలో వదిలారు. బ్రాహ్మణులకు దీపదానం చేసి కార్తీక పూజలు చేశారు. అభయ ఆంజేయస్వామికి, రావిచెట్టు వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. దీంతో ఫెర్రీ రోడ్డు కార్తీక శోభతో కళకళలాడింది. స్థానిక శివాలయంలో ఉన్న రాజరాజేశ్వరస్వామికి తెల్లవారుజాము నుంచి భక్తులు పూజలు చేశారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో మూడో సోమవారం మండలంలో ఉన్న శివాలయాలన్నీ భక్తజనసంద్రంగా మారాయి. ఓంనమఃశివాయ మంత్రంతో శివాలయాలన్నీ మార్మోగాయి. ఉదయం నుంచి అధికసంఖ్యలో భక్తులు పరమేశ్వరునికి పంచామృతాలతో విశేష అభిషేకాలు నిర్వహించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.


అంతర్వేది శివాలయంలో నందీశ్వరుడి వద్ద దీపారాధన చేస్తున్న భక్తులు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



అమలాపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి కింద జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన బాధితులకు రూ.3.24 లక్షల చెక్కులను అమలాపురం పార్లమెంటు సభ్యుడు గంటి హరీష్‌బాలయోగి లబ్ధిదారులకు అందించారు. పోతుకుర్రుకు చెందిన సరిపెల్ల సుజాతకు రూ.81వేలు, నాగుల్లంకకు చెందిన బళ్ల విజయలక్ష్మికి రూ.లక్షా 50వేలు, అయినవిల్లిలంకకు చెందిన కరపు భవానీకి రూ.63,366, నడిపూడికి చెందిన ఊటాల రియానాకు చెక్కులను ఎంపీ అందజేశారు. సీఎం సహాయనిధి కింద బాధితుల వైద్య ఖర్చుల నిమిత్తం ఈనిధులు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు మోకా ఆనంద్‌సాగర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్, మద్దాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.అమలాపురంలోని ఎంపీ నివాస గృహంలో కార్యక్రమం జరిగింది.

పంట భూముల ఆక్రమణ, ముంపు సమస్యను పరిష్కరించండి

- మంత్రి నిమ్మలకు కోనసీమ పరిరక్షణ నేతల వినతి


మంత్రి నిమ్మలకు మొగల ఆక్రమణలు, డ్రెయిన్ల ముంపుపై వివరిస్తున్న దృశ్యం

అల్లవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అల్లవరం, ఉప్పలగుప్తం, కాట్రేనికోన తదితర మండలాల్లో పంట భూముల ఆక్రమణల వల్ల పలు డ్రెయిన్లలో ముంపునీరు దిగక వేలాది ఎకరాల్లో పంట సాగు ఇబ్బందిగా మారిందని నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు కోనసీమ రైతు పరిరక్షణ సంఘం అధ్యక్షుడు యాళ్ల బ్రహ్మానందం, రైతులు వివరించారు. ఈసందర్భంగా వారు మంత్రికి వినతిపత్రం అందజేశారు. ముంపు వాటిల్లే మండలాలను మ్యాప్ ద్వారా మంత్రికి వివరించారు. యాళ్ల బ్రహ్మానందం, కోనసీమ పరిరక్షణ సంఘం రైతు నాయకులు ఆకుల లక్ష్మణరావు, యాళ్ల కాసుబాబు, పెమ్మిరెడ్డి సత్యనారాయణ, గుర్రం బాబు తదితరులు మంత్రి నిమ్మలకు రైతుల సమస్యలు వివరించారు. సెంట్రల్ డెల్టాలో 1.72లక్షల ఎకరాల్లో వరిసాగు జరుగుతుంటే రామేశ్వరం మొగ, కూనవరం మొగల మీదుగా 40వేల ఎకరాల ఆయకట్టు ముంపునీరు దిగాల్సి ఉందని పేర్కొన్నారు. తరచూ మొగలు మూసుకుపోయి పంటభూముల ఆక్రమణల వల్ల రూ.75కోట్ల పంట నష్టం వాటిల్లుతుందన్నారు. రామేశ్వరం మొగ పరిధిలో 480ఎకరాల పంటభూములు, ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాల పరిధిలో, ఎస్.యానాం, చిర్రయానాం పంటభూములు కలిపి 1650ఎకరాల పంటభూమి కబ్జాకు గురైందన్నారు. ఆక్రమిత పంట భూముల్లో అక్రమ ఆక్వాసాగు వల్ల డ్రెయిన్ల ద్వారా వచ్చే ముంపు ఆక్రమణల వల్ల తగ్గి పంట నష్టం వాటిల్లుతుందన్నారు. కోనసీమ జిల్లాలో 288కిలోమీటర్ల పొడువున 16మేజరు డ్రెయిన్లు, 243కిలోమీటర్ల పొడువున 201మైనరు డ్రెయిన్లు, 1570కిలోమీటర్ల పొడువున 1100చిన్నతరహా డ్రెయిన్లు ఉన్నాయన్నారు. వీటి పరిధిలో కోనసీమలోని పలు మండలాల్లో వేలాది ఎకరాలు ముంపు బారిన పడుతున్నాయని, ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మంత్రి నిమ్మలను కోరారు. మంత్రి నిమ్మల రైతుల సమస్యల పరిష్కా రానికి సానుకూలంగా స్పందించారు.

రేపు పి.గన్నవరంలో టీడీపీ కార్యాలయం ప్రారంభం


మాట్లాడుతున్న మోకా ఆనందసాగర్

పి.గన్నవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరంలో బుధవారం టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతిధి మోకా ఆనందసాగర్ తెలిపారు. పి.గన్నవరంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు, మంత్రి వాసంశెట్టి సుభాష్, పార్టీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, జిల్లా ముఖ్య నాయకులు హాజరవుతారన్నారు. అనంతరం కార్తీక వనసమారధన నిర్వహిస్తామన్నారు.

సీఎం సహాయనిధిలో అవినీతి లేదు

సీఎం సహాయనిధి పంపిణీలో అవినీతి జరుగుతుందని వైసీపీ నియోజకవర్గ ప్రతినిధి ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ నాయకులు చిట్టూరి శ్రీనివాస్, మద్దాల సుబ్రహ్మణ్యం, దాసరి వీరవెంకటసత్యనారాయణ అన్నారు. సీఎం సహాయ నిధి విషయంలో కూటమి నాయకులు తప్పుచేసినట్లు నిరూపిస్తే మా నాయకులంతా మీకు తలవంచుతామన్నారు. పార్టీలకు అతీతంగా సీఎం సహాయ నిధి చెక్కులు నియోజకవర్గంలో రూ.4.50కోట్లు అందించామన్నారు. నియోజకవర్గ కో-కన్వీనర్ దాసరి వీరవెంకటసత్యనారాయణ, చిట్టూరి శ్రీనివాస్, మద్దాల సుబ్రహ్మణ్యం, మోల్లేటి శ్రీనివాస్, బోనం బాబు, నక్కా సత్యనారాయణ, పులపర్తి సుజాత, రవణం రాము, గుత్తుల రామకృష్ణ, రాణీ శ్రీనివాసశర్మ, పత్తిపాటి వెంకన్నబాబు, కేదాశి చిన్న, నిమ్మకాయల శేషయ్య, పడాల వెంకటేశ్వరరావు, గుమ్మడి వెంకటేశ్వరరావు, పైడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ గ్రాడ్యుయేట్స్ ఇంజనీర్స్ కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన పంచాయతీరాజ్ గ్రాడ్యుయేట్స్ ఇంజనీర్స్ కార్యవర్గం

అమలాపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా పంచాయతీరాజ్ గ్రాడ్యుయేట్స్ ఇంజనీర్స్ జిల్లా కార్యవర్గ జనరల్ బాడీ సమావేశం ఆదివారం స్థానిక పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్‌లో జరిగింది. 2025-2028ఏడాదికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా పంచాయతీరాజ్ గ్రాడ్యుయేట్ ఇంజనీర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా బి.దుర్గాకొండలరావు, ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.సుజాత, ఫైనాన్స్ సెక్రటరీగా పి.సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఎలక్షన్ ఆఫీసర్, ఇరిగేషన్ ఏఈ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ నాయుడు ఈ కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈసందర్భంగా అసోసియేషన్ ప్రగతికి పాడుపడాలని ఈఈ పులి రామకృష్ణరెడ్డి తెలిపారు. నూతనకార్యవర్గ సభ్యుల సమస్యలపై రాష్ట్రకార్యవర్గం దృష్టిపెట్టి పరిష్కారం చూపాలని, పంచాయతీరాజ్ ఇంజనీర్స్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్యం రాంబాబు తెలిపారు. నూతన కార్యవర్గానికి అన్యం రాంబాబు, డీఈ శుభాకాంక్షలు తెలిపారు.



యానాంలో దీపాలు వెలిగిస్తున్న దృశ్యం,అంబాజీపేట: పుల్లేటికుర్రులో వ్యాఘ్రేశ్వరస్వామికి అభిషేకం

బీజేపీ సమావేశం

యానాం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక మినీ జీవీఎస్ హాలులో యానాం నియోజకవర్గంలో ఓటరు ఎన్యూమరేషన్‌పై సోమవారం యానాం బీజేపీ అధ్యక్షుడు కనకాల రాజు నేతృత్వంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పుదుచ్చేరికి చెందిన బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఆర్.బి.అశోక్‌బాబు, పార్టీ స్టేట్ సెక్రటరీ పోహాలేంది హాజరయ్యారు. సమావేశంలో అశోక్‌బాబు మాట్లాడారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలపరిచే దిశగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఓటరు ఎన్యూమరేషన్ కార్యక్రమం విస్తృతంగా కొనసాగుతుందన్నారు. బూత్‌స్థాయి కార్యకర్తలు, ఏజెంట్లు సమగ్రంగా పనిచేసి ఎవరూ ఓటు హక్కు కోల్పోకుండా చూడాలన్నారు. యానాంలో 33 బూత్‌లు ఉన్నాయని, ప్రతి బూత్‌క ఏజెంట్‌ను నియమించి, వారి సహకారంతో ఓటర్ల వివరాలు సక్రమంగా నమోదు చేయించాలన్నారు. నాయకులు సబ్బతి లోకేశ్వరరావు, కనకాల రాందాసు, చిక్కాల నర్సింహమూర్తి, కాకి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వనసమారాధన

రాజోలు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): శివకోడు శ్రీమంగెన గంగయ్య తెలగ కల్యాణ మండపంలో కార్తీక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. పిల్లల ఆటపాటలతో ఆ ప్రాంగమంతా సందడి నెలకొంది. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఉసిరిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, టీడీపీ సీనియర్ నాయకుడు మెట్ల రమణబాబు, టీడీపీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య, జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పాల్గొని ప్రసంగించారు. అధిక సంఖ్యలో కాపు, తెలగ సంఘీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాజోలు తాలూకా తెలగ సంఘం గౌరవాధ్యక్షుడు సోమిశెట్టి ఆంజనేయులు, అధ్యక్షుడు కొమ్ముల మధుమూర్తి, ఉపాధ్యక్షుడు కుంపట్ల చిన్నారి, తాటిపాక సర్పంచ్ కోటిపల్లి రత్నమాల, దిరిశాల బాలాజీ, పినిశెట్టి బుజ్జి,పామర్తి రమణ, పోతు కాశీ, రావి మురళీ పాల్గొన్నారు.

రేపు బోడసకుర్రులో బోట్స్‌మెన్ డైరెక్టర్ల ఎన్నిక

అల్లవరం, నవంబరు10(ఆంధ్రజ్యోతి):బోడసకుర్రు పల్లిపాలెం బోట్స్‌మెన్ సొసైటీ డైరెక్టర్ల ఎన్నిక ఈనెల12న జరుగుతుందని ఎఫ్‌డీవో, ఎన్నికల అధికారి పాల దేవికనకప్రసాద్ తెలిపారు. ఈనెల12న 9మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారని, వారిలో ప్రెసిడెంట్, సెక్రటరీలుగా 13న ఎన్నిక జరుగుతుందన్నారు. 9మంది డైరెక్టర్ అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు.

విద్యార్థి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

అంబాజీపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): విహారయాత్రకు వెళ్లి ధనమ్మమర్రి వద్ద గోదావరిలో పడి విద్యార్థి నామాడి బన్ను మృతిచెందగా ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పరామర్శించారు. పుల్లేటికుర్రు చీకురుమిల్లివారిపేటలో బన్ను మృతదేహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థి తండ్రి అబ్రహంను ఓదార్చారు. సర్పంచ్ జల్లి బాలరాజు, మాజీ సర్పంచ్ నూకపెయ్యి చిన్న పరామర్శించారు.

మల్లాడి ఆధ్వర్యంలో అయ్యప్ప పూజ


భోజనాలు వడ్డిస్తున్న మల్లాడి దంపతులు

యానాం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు స్వగృహంలో 19వ అయ్యప్ప పూజ ఘనంగా నిర్వహించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. వెయ్యి మంది అయ్యప్ప స్వాములకు, భవాని, శివ భక్తులను భిక్ష ఏర్పాటు చేశారు. అనంతరం మల్లాడి దంపతులు పండ్లు పంపిణీ చేశారు.

పరిశ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టర్‌గా భూలక్ష్మి



పి.గన్నవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టర్‌గా ముంగండ గ్రామానికి చెందిన టీడీపీ నాయ కురాలు మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి నియమితు లయ్యారు. సోమవారం ప్రభుత్వం విడుదలచేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. భూలక్ష్మి ముంగండ ఎంపీటీసీగా ఎన్నికై టీడీపీ -జనసేన జెంటిల్‌మెన్ ఒప్పందంలో రెండేళ్ల ఎంపీపీగా పనిచేశారు. ప్రస్తుతం ఆమె ఎంపీటీసీగా కొనసాగుతున్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు భూలక్ష్మి, దంపతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

మామిడికుదురు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు ప్రతీ ఒక్కరూ హెల్మెట్ ధరించి రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని నగరం ఎస్‌ఐ ఎ.చైతన్యకుమార్ సూచించారు. సామాజిక సేవలో భాగంగా పాశర్లపూడికి చెందిన విశ్రాంత హెచ్‌ఎం అందించిన హెల్మెట్‌లను ఎస్‌ఐ సోమవారం 50మంది మహిళా వాహనదారులకు అందించారు.

ముక్కామల సొసైటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అంబాజీపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ముక్కామల సొసైటీ ద్వారా రైతులకు మరిన్ని సేవలందించి ఆదర్శ సొసైటీగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ముక్కామల సొసైటీ చైర్మన్‌గా కుడుపూడి రాంబాబు, సభ్యులుగా రాకుర్తి ప్రసాద్, యాళ్ల వెంకట సత్యనారాయణతో సోమవారం సొసైటీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే ప్రమాణస్వీకారం చేయించారు. తొలుత ముక్కామల లాకుల సెంటర్ నుంచి సొసైటీ కార్యాలయానికి భారీర్యాలీ నిర్వహించారు. నీటిపారుదల శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, ఇండస్ట్రియల్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టపర్తి భారతి, మార్కెట్ కమిటీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ కో కన్వీనర్ దాసరి వీరవెంకట సత్యనారాయణ, వాసంశెట్టి కుమార్, అక్కిశెట్టి ప్రసాద్, సొసైటీ చైర్మన్లు అరిగెల సూరిబాబు, దొమ్మేటి సురేష్, అల్లాడ రవి, నాయకులు యనమదల రాజబాబు, బండారు మల్లిబాబు, గంధం వెంకటేశ్వరరావు, పితాని శ్రీనివాసరావు, నాగాబత్తుల వెంకటసుబ్బారావు పాల్గొన్నారు.

ఒకేషనల్ స్కిల్ కాంపిటేషన్ రిటైల్ విభాగంలో..
కడలి హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

రాజోలు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ ఉన్నత పాఠశాలలో వృత్తివిద్యా కోర్సులకు సంబంధించి సమగ్రశిక్ష ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో పోటీల్లో కడలి జడ్పీ ఉన్నత పాఠశాల నలుగురు విద్యార్థులు రిటైల్ విభాగంలో జిల్లాలో ప్రథమస్థానం సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈసందర్భంగా కడలిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సున్నా శాతం ప్లాస్టిక్ రిటైల్ స్టోర్ విభాగంలో సీఎంవో సుబ్రహ్మణ్యం చేతులమీదుగా అవార్డును అందుకున్నారని తెలిపారు. 9వ తరగతి విద్యార్థులు మామిడిశెట్టి గౌతమ్, గటిగంటి రవివర్మ, ఆచంట ఆంజనేయుడు, మామిడిశెట్టి రామకిరణ్‌లు ఈఘనత సాధించినట్టు తెలిపారు. రిటైల్ టీచర్ కె.పెద్దిరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు శిక్షణ పొందారని తెలిపారు. ఈనెలలో రాష్ట్ర రాజధానిలో జరిగే పోటీలకు అర్హత సాధించడం పట్ల ఉపాధ్యాయులు, స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీచైర్మన్ వడ్లమూడి ప్రకాశరావు, సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

అగ్నిప్రమాద బాధితులకు ఎమ్మార్పీఎస్ సాయం

అంబాజీపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కె.పెదపూడి తిరుమనాధం వారిపాలెం శివారులో అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను పి.గన్నవరం ఎమ్మార్పీఎస్ సభ్యులు పరామర్శించి నిత్యావసరాలు అందించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకోవాలని వారు కోరారు. ఎమ్మార్పీఎస్ పి.గన్నవరం మండల అధ్యక్షుడు కాప నాని, ఎంఎస్పీ అధ్యక్షుడు కాప బాబూరావు, గౌరవ అధ్యక్షుడు తవిటికి విరమన్యుడు, జిల్లా నాయకులు ఆకుమర్తి ఆశీర్వాదం, చింతపర్తి భీముడు, ఉందుర్తి ధనరాజు, ఎన్.నాగరాజు, చింతపర్తి సీమయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌లో విద్యార్థి వంశీకి పతకం



రాజోలు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూలు గేమ్స్‌ఫెడరేషన్‌లో భాగంగా ఇటీవల విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో శివకోడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి మట్టపర్తి బాలవంశీ అండర్-17 లో కాంస్య పతకం సాధించాడని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.శ్రీనివాస్ తెలిపారు. శివకోడులో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో బాలవంశీ కాంస్య పతకం సాధించడంపై సంతోషం వ్యక్తం చేశారు. బాలవంశీని సర్పంచ్ నక్కా రామారావు, ఎంపీటీసీలు బొడ్డు కృష్ణారావు, ఉండ్రు సూర్యారావు, పీఎంసీ చైర్మన్ అప్పారి దుర్గాభవానీ, వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

చిత్రలేఖనంలో రాష్ట్ర స్థాయి పోటీలకు రామచంద్రిక



పి.గన్నవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇంధనం పొదుపు అనే అంశంపై నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో కె.ఏనుగుపల్లి హైస్కూల్ విద్యార్థిని అడబాల రామచంద్రిక రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని ఎన్.ఎలిజబిత్ తెలిపారు. 9వ తరగతి చదువుతున్న రామచంద్రిక వారం రోజులు క్రితం ఇంధనం పొదుపు అంశంపై చిత్రలేఖనం గీసి పోస్టు ద్వారా వైజాగ్‌లోని ఎన్‌టీపీసీకి పంపినట్టు ఆమె తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 3500మందికి చెందిన డ్రాయింగ్‌ను పరిశీలించగా 100మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన రామచంద్రిక ఈనెల 19న వైజాగ్ ఎన్‌టీపీసీలో జరిగే చిత్రలేఖనం పోటీల్లో పాల్గొంటుందని ఆమె తెలిపారు. విద్యార్థినికి హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినంధనలు తెలిపారు.

ప్రత్యేకావసరాల పిల్లలపై శ్రద్ధ తీసుకోవాలి

ముమ్మిడివరం, నవంబరు10(ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలను సాధారణ పిల్లలతో దీటుగా తీర్చిదిద్దేందుకు భవిత కేంద్రాల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి స్టేట్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, స్టేట్ కోఆర్డినేటర్ నరసింహ నరసింహ సూచించారు. ముమ్మిడివరంలో భవిత కేంద్రాన్ని సోమవారం వారు సందర్శించి విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. ఫిజియోథెరపీ పొందిన పిల్లలు స్పీచ్ థెరపీ పొందిన పిల్లలు సాధించిన ప్రగతిని వారు పరిశీలించారు. భవిత కేంద్రంలో నిర్వహిస్తున్నరికార్డులను పరిశీలించి అక్కడ అమలు చేసే కార్యక్రమాలు, సాధించే ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. జిల్లా కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, అకడమిక్ మోనటరింగ్ ఆఫీసర్ రాంబాబు, ఐఈఆర్పీలు రమాదేవి, శ్రీలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఉద్యోగులకు జీతాల చెల్లింపు

మామిడికుదురు, నవంబరు10(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రంలో-2025 రబీ సీజన్‌లో నగరం పీఏసీఎస్‌లో తాత్కాలిక పద్ధతిలో పనిచేసిన తొమ్మిది మంది సిబ్బందికి సోమవారం సొసైటీ చైర్మన్ ఈలి శ్రీనివాస్ వేతనాలు చెల్లించారు. మామిడికుదురులోని సొసైటీ కార్యాలయం వద్ద ప్రభుత్వం నుంచి విడుదలైన రూ.2.10 లక్షల చెక్కులను సిబ్బందికి అందించారు. కార్యక్రమంలో సొసైటీ మెంబర్లు ఎం.సత్తిబాబు, కె.శ్రీనివాస్, సీఈవో అడబాల పెద్దిరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యర్రపోతవరం, భట్లపాలికలో స్వామిత్వ సర్వే



యర్రపోతవరం సభలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

కె.గంగవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): యర్రపోతవరం, భట్లపాలికలో సోమవారం స్వామిత్వ సర్వే నిర్వహించారు. ఆయా గ్రామ సర్పంచ్‌లు పిల్లి రాంబాబు, యలమంచిలి పద్మావతి అధ్యక్షతన జరిగిన సభల్లో ఎంపీడీవో ఎస్. శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో యాళ్ల భవాని శంకరుడు పాల్గొని మాట్లాడారు. ఈసర్వేలో గ్రామాల్లో ఖాళీగా ఉన్న స్థలాలను గుర్తించడం జరుగుతుందన్నారు. అలాగే వాటి వివరాలు గ్రామసభలో ప్రజల ముందు ఉంచుతూ వాటికి సంబంధించిన పేపర్లు తీసుకుని పంచాయతీ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో యర్రపోతవరం సొసైటీ అధ్యక్షుడు సాపిరెడ్డి విశ్వనాథ బాలాజీ, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'అంగర'లో గర్భిణులకు ప్రత్యేక వైద్యపరీక్షలు


అంగర పీహెచ్‌సీలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న రత్నకుమారి

కపిలేశ్వరపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంగర పీహెచ్‌సీలో సోమవారం గర్భిణులకు ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా వైద్యాధికారిణి రత్నకుమారి ఆధ్వర్యంలో 27 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. వారిలో ముగ్గురిని హైరిస్క్ గర్భిణులుగా గుర్తించి ఉన్నత వైద్యం కోసం కపిలేశ్వరపురం సీహెచ్‌సీకి రిఫరల్ చేశామని డా. రత్నకుమారి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో మల్లిఖార్జునుడు, డిప్యూటీ హెచ్‌ఈవో రామారావు, హెచ్‌వీ మేరీమణి, హెల్త్ సూపర్‌వైజర్ నానిబాబు, ల్యాబ్ టెక్నిషియన్ అలీ, స్టాఫ్‌నర్సు బంగారుపాప, ఫార్మసీ అధికారి ప్రిస్కిల్ల, ఎంఎల్‌హెచ్‌పి దేవి, ఆరోగ్య కార్యకర్తలు వెంకటేశ్వర్లు, దుర్గ, బేబీ, ఆశాకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రాయవరం హైస్కూల్‌కు రూ. రెండు లక్షల విరాళం


పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎంకు విరాళం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

రాయవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం పి.ఈశ్వరరెడ్డి అన్నారు. సోమవారం హైస్కూల్ 1973-74లో టెన్త్ క్లాస్ చదువుకున్న పూర్వ విద్యార్థులంతా కలిసి రూ. రెండు లక్షల విరాళాన్ని జిల్లా పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత సత్తి రామారెడ్డి చేతులమీదుగా అందజేశారు. పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న సైన్స్ ల్యాబ్ గది నిర్మాణ పనుల నిమిత్తం అందిచినట్టు చెప్పారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొవ్వూరి పుల్లారెడ్డి, ఎంపీ సుబ్రహ్మణ్యం, కొవ్వూరి సత్తిరెడ్డి, జేవీ రామారావు, గోలుగూరి గోవిందరెడ్డి, నక్కిన వెంకటేశ్వరరావు, దొంతంశెట్టి సత్యనారాయణ, నల్లమిల్లి రామ్‌గోపాలరెడ్డి, కర్రి ఉమామహేశ్వరరెడ్డి, పీఎంసీ చైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకుడు ఐఎస్‌ఎన్‌కు మాతృవియోగం

● పలువురు నేతల సంతాపం


సత్యవతి (ఫైల్)

మండపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ఐఎస్‌డీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఇనపకోళ్ల సత్యనారాయణ (ఐఎస్‌ఎన్) మాతృమూర్తి ఇనపకోళ్ల సత్యవతి (80) వృద్ధాప్యంతో బాధపడుతూ సోమవారం సాయంత్రం గొల్లపుంతలో తుది శ్వాస విడిచారు. ఈమెకు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె వున్నారు. ఆమె మరణంతో కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఈమె అంత్యక్రియలు సోమవారం రాత్రి మండపేటలో అభిమానులు, కుటుంబ సభ్యులు మధ్య జరిగాయి. ఈమె మృతిపట్ల ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, జనసేన పార్టీ నేత, ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, ఫ్రెండ్స్ అండ్ ఫ్రెండ్స్ సభ్యులు, సహచర మిత్రులు, తదితరులు సంతాపం తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కపిలేశ్వరపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం గం 10.30 కు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో హెచ్. భానూజీరావు తెలిపారు. ఎంపీపీ సాకా శ్రీనివాస్ అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతుందన్నారు. దీనికి డివిజన్, మండల స్థాయి అధికారులు వారి శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను ముందుగా సమర్పించాలని కోరారు.


రాయవరంలో ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరస్వామి


కోటిపల్లి శివాలయంలో అభిషేకాలు చేస్తున్న రుత్వికులు


కపిలేశ్వరపురంలో అభిషేకాలు చేస్తున్న అర్చకులు

భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు

● ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఆయా ఆలయ కమిటీలు

రాయవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవక్షేతాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. కార్తీకమాసం మూడో సోమవారం నేపథ్యంలో అష్ట సోమేశ్వరాలయాలుగా ఖ్యాతిగాంచిన సోమేశ్వరం బాలత్రిపురసుందరి సమేత సోమేశ్వరస్వామి, వెంటూరు పార్వతి సోమేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సోమేశ్వరంలో పురోహితులు పరిటాల సుబ్రహ్మణ్య శర్మ, పరిటాల సోమశేఖరశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. వెంటూరు సోమేశ్వరస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు జరిపారు. రాయవరం పార్వతీసమేత రాజరాజేశ్వరస్వామి ఆలయంలో విలపర్తి ఫణిధర్, శశిధర్‌శర్మ ఆధ్వర్యంలో, రాయవరం అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, చెల్లూరు అగస్తేశ్వరస్వామి, లొల్ల ఉమా రామలింగేశ్వర స్వామి, వి.సావరం మాణిక్యాంబ సమేత బీమేశ్వరస్వామి, పసలపూడి బీమేశ్వరస్వామి ఆలయ్యా ప్రత్యేక అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు కాలువల్లో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్తీకనోములు పురస్కరించుకుని వేకువజామునుంచి పార్వతి పరమేశ్వరుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

కె.గంగవరం: పవిత్ర కార్తీకమాసం మూడో సోమవారం కోటిపల్లి పుణ్యక్షేత్రం భక్తుల శివనామస్మరణతో హోరెత్తింది. వేకువజాము నుంచే భక్తులు గోదావరినదిలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ ఛాయా సోమేశ్వరస్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలు వెలగించారు. రాత్రికి స్వామివారికి లక్ష బిల్వార్చన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. యండగండి, పామర్రు, అముజూరు, పానింగపల్లి, సత్యవాడ, గంగవరం, కుందూరు, దంగేరు, మసకపల్లి, భట్లపాలిక, యర్రపోతవరం, బాలాంత్రం, పేకూరులో ఉదయం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు కార్తీకదీపాలు వెలిగించారు. కుందూరు శివాలయం వద్ద కార్తీక వనసమారాధన నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాలు సోమవారం శివనామస్మరణతో మార్మోగాయి. ఈ సందర్భంగా కపిలేశ్వరపురంలోని శ్రీ దుర్గాపార్వతి సమేత పాపవినాశేశ్వర స్వామి ఆలయం కార్తీకమాసం మూడవసోమవారం పురష్కరించుకుని వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో పోటెత్తింది. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో భక్తులచే స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులు ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేస్తూ కోర్కెలు నెరవేర్చాలంటూ వేడుకున్నారు. ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ పితాని సూర్యచంద్రరావు తెలిపారు. గ్రామస్థులతో పాటు పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

మండపేటలో ఉచిత వైద్యశిబిరం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ రంగారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీవరప్రకాష్, తదితరులు

మండపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళల అరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ అన్నారు. సోమవారం మండపేట పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ భవనంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన మున్సిపల్ కమిషనర్ రంగారావు, మెప్మా పీడీ పెంచలయ్యతో కలిసి ప్రారంబించారు. 30 ఏళ్ల వయస్సు దాటిన డ్వాక్రా మహిళల ఆరోగ్యం కోసం వైద్యశిబిరాలను నిర్వహించుతున్నామని పీడీ పెంచలయ్య చెప్పారు. వైద్యశిబిరంలో మహిళలకు ఉచిత రక్తపరీక్షలతో పాటు పలురకాలు వైద్యసేలను వైద్యులు అందజేశారు. ఎటువంటి లక్షణాలు లేకున్నప్పటికీ మహిళలు క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని వారు మహిళలను కోరారు. వైద్యసేవల కోసం మహిళలకు ఆయుష్మాన్‌భవ కార్డులను ఇవ్వటం జరుగుతుందని వారు చెప్పారు. కార్యక్రమంలో మోప్మాసిటి మిషన్ మేనేజర్ సుజాత, కౌన్సిలర్లు, కాళ్లకూరి స్వరాజ్య భవాని, ఆర్‌పీలు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

కేశవరంలో కొలిక్కిరాని స్థల వివాదం

● కొనసాగుతున్న పోలీసు పికెట్ ... రెండోసారి చర్చలు విఫలం

మండపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేశవరంలో గ్రంథాలయం ఏర్పాటుకు సంబంధించిన సెంటు స్థలం కోసం రెండువర్గాల మధ్య నెలకొన్న వివాదం ఇంకా కొలిక్కిరాలేదు. శనివారం నుంచి గొడవ జరుగుతూనే ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్వాములు భోజనాలు చేసేందుకు షెడ్డు నిర్మాణం కోసం స్థలం కేటాయించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు రెండేళ్లయినా వారు షెడ్డు వేసుకోలేదు. దీంతో పెరికిల వీధిలో ఖాళీగా వున్న ఆ స్థలాన్ని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యే వేగుళ్ల ఆ సామాజిక వర్గం అభ్యర్థన మేరకు పెరికిల కమ్యూనిటీ హాలు నిర్మాణానికి భరోసా ఇచ్చారు. కాగా గతంలో వైసీపీ హయాంలో షెడ్డుకోసం ఇచ్చిన స్థలంలో ఒక వర్గానికి చెందిన వారు శనివారం అర్థరాత్రి షెడ్డు వేసి వంటావార్పులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో దాన్ని తొలగించమని పంచాయతీ కార్యదర్శి నోటీసు జారీచేశారు. అయితే సున్నిత సమస్య కాస్త రెండు వర్గాలు, రెండు పార్టీలకు చెందినదిగా మారిపోయింది. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఎస్.సుబ్బారావు ఫిర్యాదు మేరకు మండపేట రూరల్ పోలీసులు సోమవారం రంగప్రవేశం చేసి పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. స్థానిక సర్పంచ్ పెదపాటి సత్తిబాబు, ఎంపీపీ ఉండమట్ల వాసు, మండల టీడీపీ అధ్యక్షుడు కర్రి తాతారావు, టీడీపీ యువ నేత ఉండమట్ల సురేష్ సోమవారం జరిపిన చర్చలు అంసంపూర్తిగానే ముగిశాయని కార్యదర్శి తెలిపారు. ఇక సమస్య ఎలా ముగుస్తుందో వేచి చూడాలి.

భీమేశ్వరాలయం.. భక్తజన సంద్రం

» స్వామి,అమ్మవార్లకు పూజలు
» దర్శనానికి బారులుదీరిన భక్తులు
» సామూహిక అభిషేకాలు


భీమేశ్వరుని దర్శనానికి లైన్లలో బారులు దీరిన భక్తులు

రామచంద్రపురం(ద్రాక్షారామ),నవంబరు10(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడో సోమవారం ద్రాక్షారామ భీమేశ్వరస్వామిని విశేష సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తెల్లవారు జాము నుంచి భక్తులు రాక మొదలయింది. లైన్ల ద్వారా భక్తులు భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకున్నారు. సామూహిక అభిషేకాలు నిర్వహించారు. అశ్వత్థ నారాయణ వృక్షం వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. ఉదయం 9 గంటల ప్రాంతానికి ఉచిత దర్శనం లైన్లలో భక్తులు బారులు తీరారు. ఆలయ సిబ్బంది, సేవకులు, ఇతర దేవాలయాల సిబ్బంది భక్తులకు సేవలందించారు. ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవానీ, ఉత్సవ ప్రత్యేకాధికారి నాగేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ఎరువులు, పురుగు మందుల అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. పైండా వారి సత్రంలో యథావిధిగా అన్నదానం నిర్వహించారు. ద్రాక్షారామ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


ర్యాలి అన్నపూర్ణదేవి ఆలయంలో లక్ష దీపోత్సవం

గుమ్మిలేరులో లక్షపత్రి పూజ

ఆలమూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మిలేరు శివాలయంలో లక్షపత్రి పూజ, లక్ష బిల్వార్చన ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపి అనంతరం ఆలయార్చకులు లక్షపత్రి, లక్ష బిల్వార్చన, హోమాలు శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలకు భక్తజనం పోటెత్తారు. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. వేకువజామునే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి నదులు, కాలువల వద్ద దీపాలు వెలిగించారు. ర్యాలి ఉమా కమండలేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి భక్తులు అభిషేకాలు నిర్వహించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించారు. జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వాడపల్లి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తులు బారులుతీరి స్వామివారిని దర్శించుకున్నారు.


భీమేశ్వరునికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా లక్షదీపోత్సవం

ర్యాలి అన్నపూర్ణదేవి ఆలయం వద్ద రెండు లక్షల ఒత్తులతో దీపోత్సవం నిర్వహించారు. కాశీ అన్నపూర్ణ విశాలాక్షి సమేత విశ్వేశ్వరపుత్ర శక్తి గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లక్షదీపోత్సవం శివనామస్మరణతో ఘనంగా నిర్వహించారు. అనంతరం కార్తీక వనసమారాధనలో అశేష భక్తజనం పాల్గొన్నారు. చింతా శ్యామ్‌కుమార్ మ్యాజిక్ ఫ్యామిలీ ఏర్పాట్లు నిర్వహించారు.


గుమ్మిలేరులో లక్షపత్రి పూజను తిలకిస్తున్న భక్తులు


ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామి ఆలయంలో భక్తులు

నిందితుడు శ్రీనివాస్‌ను కఠినంగా శిక్షించాలి

రామచంద్రపురంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ప్రదర్శన



ప్రదర్శన నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో చిన్నారి రంజితను హత్య చేసిన పెయ్యల శ్రీనివాస్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం ప్రదర్శన నిర్వహించారు. చిన్నారి హత్య పాశవికమని, నిందితుడికి ఎట్టి పరిస్థితుల్లోను ఉపశమనం ఇవ్వకూడదని ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు, మహిళలు భద్రత కోల్పోతున్నారని పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పాశవిక నేరాలకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు విధించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. నిందితుడు శ్రీనివాస్‌ను శిక్షించాలని, మహిళలు, విద్యార్థులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దూ, కె.శ్రీకృష్ణ, దినేష్, పి.హేమంత్, టి.అఖిల్, ఆర్.రోహన్, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలమూరును తూర్పులో విలీనం చేయాలి

జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ.. ఎంపీడీవోకు వినతి


ఎంపీడీవోకు వినతి పత్రం అందిస్తున్న జేఏసీ నాయకులు

ఆలమూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలను పరిపాలన పరంగా అనువుగా ఉండే విధంగా చేపడుతున్న మార్పుల్లో భాగంగా ఆలమూరు మండలాన్ని తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని కోరుతూ ఆలమూరులో సోమవారం ర్యాలీ నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ మేరకు చేపడతున్న ఉద్యమంలో భాగంగా ఆలమూరు జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. భౌగోలికంగా, పరిపాలన పరంగా రాజమహేంద్రవరానికి అనువుగా ఉండే తూర్పుగోదావరిలో కలపాలని కోరుతూ జేఏసీ నాయకులు ఎంపీడీవో ఎ.రాజుకు వినతిపత్రం అందించారు.

నెలరోజులు ఓం నమః శివాయ స్తోత్రాలు


ఓం నమః శివాయ స్తోత్రాలు ఆలపిస్తున్న భక్త మండలి

ఆలమూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆలమూరు భక్తమండలి ఆధ్వర్యంలో పదేళ్లగా ఏటా కార్తీకమాసంలో స్థానిక పార్వతి సమేత విక్రమ భట్టీశ్వరస్వామి ఆలయంలో ఓం నమః శివాయ స్తోత్రాలను ఆలపిస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం భక్తమండలి ఆధ్వర్యంలో సాగే ఈ కార్యక్రమంలో ఓం నమః శివాయ స్తోత్రాలతోపాటు విష్ణు సహస్ర నామాలు, లలితా పారాయణం, పలు భక్తి గీతాలను ఆలపిస్తుంటారు. భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న భక్తమండలి బృందాన్ని పలువురు అభినందించారు.

ల్యాబ్స్ వినియోగంపై అవగాహన కల్పించాలి

» పాల్ ల్యాబ్స్ రాష్ట్ర కోఆర్డినేటర్ కిషోర్‌బాబు, టీచ్ టూల్ అబ్జర్వర్ మాధవీలత
» మూలస్థానం హైస్కూల్లో ల్యాబ్ పరిశీలన


మూలస్థానం హైస్కూల్లో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఆలమూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంలో ఏర్పాటు చేసిన అటల్ ల్యాబ్స్‌పై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన పెంచి వాటిని సద్వినియోగం చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని పాల్ ల్యాబ్స్ రాష్ట్ర కోఆర్డినేటర్ బి.కిషోర్‌బాబు, టీచ్‌టూల్ రాష్ట్ర అబ్జర్వర్ మాధవీలత సూచించారు. ఆలమూరు మండలం మూలస్థానం జడ్పీ హైస్కూల్‌ను సోమవారం సందర్శించి అటల్ ల్యాబ్స్‌ను పరిశీలించారు. ల్యాబ్స్‌ను సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంచడానికి, సైన్స్ టెంపర్‌మెంట్‌ను డెవలప్ చేయడానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ల్యాబ్స్ వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించాలన్నారు.పాల్ ల్యాబ్స్ వినియోగించి బోధించడం వల్ల విద్యార్థుల్లో లెర్నింగ్ లెవల్స్ పెరుగుతున్నట్టు పరిశోధనలలో వెల్లడైందన్నారు. పాల్ ల్యాబ్ వినియోగంలో కోనసీమ జిల్లా తృతీయస్థానంలో ఉన్నట్టు వారు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐఈ కోఆర్డీనేటర్ నరసింహరావు, సమగ్ర శిక్ష అకడమిక్ మోనిటరింగ్ అధికారి పి.రాంబాబు పాల్గొన్నారు.

నేడు పెనికేరుకు కేంద్ర బృందం రాక

పంట నష్టాల పరిశీలన

ఆలమూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల కలిగిన నష్టాలను పరిశీలించడానికి విచ్చేస్తున్న కేంద్ర బృందం ఆలమూరు మండలం పెనికేరు గ్రామానికి మంగళవారం రానున్నట్టు వ్యవసాయ శాఖ ఆలమూరు అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్‌కేవీ చౌదరి సోమవారం తెలిపారు. తుఫాన్ నష్టాల అంచనాలను పరిశీలించడానికి వస్తున్న కేంద్ర బృందం పెనికేరులో ఖరీఫ్ వరి పంటలను పరిశీలించనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృందంతోపాటు జిల్లాకు చెందిన పలువురు అధికారులు పాల్గొననున్నట్టు చెప్పారు.

వెంకన్న అన్నదాన పథకానికి రూ.1.40 లక్షల విరాళం


అన్నదానానికి విరాళం అందిస్తున్న శ్రీధర్-పద్మజ దంపతులు

ఆత్రేయపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డుకు చెందిన ఎస్‌వీఎస్ ఆటోమోటివ్స్ అధినేత డి.శ్రీధర్-పద్మజ దంపతులు రూ.1,4 0,999 విరాళం సమర్పించారు. దాతలకు ఆలయ ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్తీక సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని, అన్నప్రసాదం స్వీకరించారు.

వరిలో నల్లకాయ

పంట దిగుబడిపై ప్రభావం
చూపుతుందంటూ రైతుల్లో ఆందోళన

రావులపాలెం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావ సమయంలో వీచిన విషపు గాలుల నేపథ్యంలో స్వర్ణ రకం వరి పంట పొలాలు నేలకొరగగా 1318 రకానికి మరో బెడద వచ్చింది. రావులపాలెం మండలంలోని వరి పంట పొలాలు తుఫాన్ సమయంలో స్వర్ణ రకం నేలకొరిగి దెబ్బతిన్నాయి. 1318 రకం సాగుచేసిన రైతులు తమ పంట పొలాలు ఈనిక దశలో నిలబడి ఉండడంతో దిగుబడి ఆశించిన తరహాలో వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తుఫాన్ సమయంలో వీచిన విషపు గాలులు, తుఫాన్ అనంతరం పరిణామాల కారణంగా వెన్నులలో అధికంగా నల్లకాయ ఏర్పడడంతో దిగుబడి తగ్గి నష్టపోతామంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.